ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

నవంబర్ 5, 2006

Entered



కథా నిలయం
శ్రీకాకుళం

కాటేసే కాస్మెటిక్స్

హ్యాపీ బర్త్‌డే

(5.11.2006 నుండి
11.11.2006 వరకు)

పి. సాత్విక
5సం॥, నవంబర్-6
పద్మజ-రవీందర్‌రెడ్డి
చంపాపేట్-హైదరాబాద్

జి. అంజలి
4సం॥, నవంబర్-6
సావిత్రి-నాగేష్
కుబీర్-ఆదిలాబాద్

పి.రతిక
3సం॥, నవంబర్-8
పద్మజ-రవీందర్‌రెడ్డి
చంపాపేట్-హైదరాబాద్

ఎస్.పి. చందన
నవంబర్-9
కరుణశ్రీ-శేషు
ఆదిలాబాద్

బి. సాహితి
1సం॥, నవంబర్-2005
స్వరూప-శ్రీకాంత్
మ॥నగర్

కె. చిన్ను
1సం॥, నవంబర్-3
రాజ్యలక్ష్మి-వీరయ్య
ముషీరాబాద్-హైదరాబాద్

ఎ. నర్మద
1సం॥, నవంబర్-2005
లలిత-శేషగిరిరావు
ములకలపల్లి-ఖమ్మం

కె. కల్యాణి
పద్మావతి-వెంకట్రావు
సమతానగర్-ఒంగోలు

ఎం. పవన్
సరళ-రాజ్
జియాగుడ-హైదరాబాద్

సిహెచ్. మురళీకృష్ణ
అరుణ-శ్రీనివాసరావు
కృష్ణలంక-విజయవాడ

వై. కార్తికేయ(కార్తీక్)
నాగశిరోమణి-శ్రీనివాసరావు
గన్నవరం-కృష్ణా



సాంకేతిక విప్లవం ప్రారంభమైంది

మన అతిథి గురించి...

పేరు	:	వై. వెంకటేశ్వర్‌రావు
పుట్టింది	:	04-01-1948
స్వగ్రామం	:	వర్ని, నిజామాబాద్
చదువు	:	మైనింగ్ ఇంజనీరింగ్, పిహెచ్‌డి
వృత్తి	:	ప్రస్తుతం వరంగల్‌లోని 'నిట్' డైరక్టర్
అభిరుచులు	:	పుస్తకాలు చదవడం, సంగీతం వినడం
ఇష్టమైన ఆహారం	:	ఆంధ్ర, తెలంగాణ వంటకాలు

ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పరిణామాల నేపథ్యంలో భారతదేశంలో సాంకేతిక విప్లవం ప్రారంభమైంది. రెండు దశాబ్దాల క్రితం ఇంజనీరింగ్ విద్యతో పోల్చితే నేడు ఎన్నో రెట్లు అభివృద్ధి జరిగింది. అనేక మార్పులు సంభవించాయి. ఇందుకు తగ్గట్టు మనమూ మారాల్సి ఉన్న నేపథ్యంలో సామాజిక విలువలు పడిపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక విద్యకై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. మనవాళ్ళు అంతర్జాతీయ పోటీని తట్టుకునే రీతిలో విద్యాబోధన జరగాల్సి ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో మనదేశాన్ని పోలిస్తే ఎంతోకొంత పురోగతిలోనే ఉన్నాం. దీన్ని మరింత విస్తరింప చేసుకోవాల్సి ఉంది. భారతదేశంలోని 20 'నిట్' కళాశాలలతో పోలిస్తే వరంగల్ కళాశాల సైతం అభివృద్ధిలో ఉంది. వచ్చే మూణ్ణెల్లలో వరంగల్ నిట్‌లో సంస్కరణలు ప్రవేశపెడుతున్నాం.

ఈ సంచికలో...

టపా ... 2
మనమూ మన నమ్మకాలు... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14

ఇంకా...

ఇలా వుందామా... 7
పెరటి చెట్టు

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
ముగ్గిపోయినై
అవీ...ఇవీ ... 20
మనసా... తెలుసా ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

సందేశాత్మకం

'మన అతిథి' గంటేడ గౌరునాయుడుగారు నిజంగా స్ఫూర్తినిచ్చేలా సందేశాన్నిచ్చాడు. డబ్బు యావతో పతనమవుతోన్న సమాజానికి మార్గనిర్దేశనం చేశాడు. 'డబ్బు' వలలో పడి చిక్కి శల్యమవుతోన్న విజ్ఞానాన్ని కాపాడి సరైన విలువలతో మెలగాలని యువతకు సూచించాడు. మాతృప్రేమ, పితృప్రేమ, దేశభక్తి వంటి మాటలను పలికిమాలినవిగా భావిస్తోన్న యువతను హెచ్చరిస్తూ సరైన దిశానిర్దేశనం చేయడం నిజంగా ముదావహం.

అరుణతేజ, ధర్మన్నగూడెం, యాచారం, రంగారెడ్డి

నాలుగు దశాబ్దాల రైలు

లార్డ్ డల్‌హౌసీ ప్రతిపాదించిన, రైల్వే వ్యవస్థ విశ్వరూపం ధరించింది. నాలుగు దశాబ్దాల దక్షిణ మధ్య రైల్వే విజయోత్సవం చేసుకోవడం ముదావహం. సంస్కృతి, రవాణా వేగం, వ్యాపారాత్మకంగా మెరుగువడి రైలు ద్వారా వివరీతంగా పెరిగింది. ఆర్.పి.ఎఫ్ రక్షణతో మసలుతున్న రైల్వే వ్యవస్థ ప్రభుత్వ రంగాన పరిఢవిల్లు తోంది. 'రోకలిబండ పురుగు' రైలుగా రూపొందడం ఆశ్చర్యం ప్రగతిపట్టాలపై రైలు పరు గెడుతూ ఉండాలి. రుచికరమైన బేసిన్ లడ్డూ తయారుచేసే పద్ధతిని ఇవ్వడం బాగుంది. యువత విలువలవైపు నడపడం గౌరునాయుడుగారి ధ్యేయమైతే ఇంకేం కావాలి?! ప్రభుత్వరంగానే వంగడాలు నడవాలి అనటం బాగుంది. కార్టూన్లు బాగున్నాయి.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

వాస్తుభ్రమలు

'మనమూ మన నమ్మకాలు'ల పి. జ్యోతి గారు రాసిన 'సొమ్ము పోయి దిమ్మ తిరిగె' కథాంశం కథనం బాగుంది. విషయాన్ని సరళంగానూ, సంక్షిప్తంగానూ వివరించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలోనూ 'వాస్తు' అనే నమ్మకంతో నానా పాట్లు పడుతున్నవారు చాలామంది ఉన్నారు. వాస్తు భ్రమలతో కట్టిన ఇళ్ళను కూడా కూలగొడుతూ డబ్బును, సమయాన్ని వ్యర్థం చేసేవాళ్లు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటివారికి ఇది కాసింతైనా కళ్ళు తెరిపిస్తుందని అనుకుంటున్నాను. మనిషికి అన్నిటికంటే ప్రశాంతమైన, పదిలమైన ప్రదేశం ఇల్లు మాత్రమే. అలాంటి ఇంట్లో వాస్తు భ్రమలతో కాలంగడిపితే ఎదురయ్యే ఇబ్బందులను చక్కగా వివరించారు. ఇప్పటికైనా వాస్తు భ్రమల్లో ఉన్నవారు వాటినుండి బయటపడి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నడుచుకుంటారని ఆశిస్తున్నాను.

మాణిక్యం, ఆర్.టి.సి. క్రాస్ రోడ్, హైదరాబాద్

స్ఫూర్తిదాయకం

క్యాంపస్ ఛాట్ ఈసారి చాలా బాగుంది. ఆర్ట్స్ సబ్జెక్టు విద్యార్థులను చులకనగా చూసేవారికి కనువిప్పు కలిగించేదిగా ఉంది. ఆయన సాధించిన విజయం వెనుక 'ఆ నలుగురు' పాత్రను బాగా వివరించారు. చక్కని పద ప్రయోగంతో చేసిన దృశ్యవర్ణన బాగుంది. 'వారి కను చివరలనుంచి తళుక్కుమంటూ రాలిన కన్నీటి బొట్లు వారు పడుతున్న పశ్చాత్తాపాన్ని వెల్లడి స్తున్నట్లున్నాయి. తేలికపడిన హృదయంతో వారిని హత్తుకున్నాను' ... అనే ప్రయోగం ఆ సందర్భాన్ని పాఠకుడి కళ్ళముందు మెదిలేట్టు చేసింది. ఇది కేవలం కాలక్షేపంకోసం అన్నట్లుగాక ఆలోచింపజేసేదిగా వుంది. దీన్ని అందించిన రచయిత సిహెచ్ కాశీ విశ్వనాథ్‌గారికి కృతజ్ఞతలు.

పి.ఎమ్. రావు, వరంగల్

నవ్వించి, ఆలోచింపజేసే కార్టూన్లు

అక్టోబర్ 21నాటి సంచికలో వచ్చిన కార్టూన్లు బాగున్నాయి. దీపావళి ధమాకాలా అనిపించాయి. కార్టూన్లను అందించిన హరిగారికి, శేఖర్‌గారికి కృతజ్ఞతలు. తెరవగానే చిన్నారుల హ్యాపీ బర్త్‌డే పేజీ ఉండడంతో వారే లోపలికి ఆహ్వానించినట్లు అనిపిస్తోంది. పోతే న్యాయ సలహాలు శీర్షికన అనేక లీగల్ సందేహాలకు సమాధానాలను అందిస్తోన్న జి.ఎల్. నరసింహారావుగారికి ధన్యవాదాలు.

రాకేష్, నారాయణగూడ, హైదరాబాద్

శుభాభినందనలు

అదిరెను 'రూబీ'స్టైలే చికుబుకు చికుబుకు రైలే... అంటూ నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న దక్షిణ మధ్య రైల్వేకు శుభాభినందనలు. ప్రజలకు మరింత చేరువై ఇంకెన్నో సదుపాయాల్ని కల్పిస్తూ అందరి మన్ననల్ని పొందాలని ఆకాంక్షిస్తున్నాను. దీపావళి కార్టూన్లు బాగున్నాయి.

వేదాంత్ రాయ్, చిట్యాల

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

రూ. 150/-కే ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్ధమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3911

Name: ....

Address: ....

....

....

....

.........................: Pincode

మనమూ - మన నమ్మకాలు

మొలకలపల్లి కోటేశ్వరావు

చూస్తూచూస్తూ...

ఆరేళ్ళ బుజ్జిగాడు రాత్రంతా ఒకటే ఏడుపు. వాడికీ, వాడితోపాటు వాళ్ళ అమ్మ సుబ్బులికీ రేయంతా కంటిమీద కునుకులేదు. పడుకోబోయేవరకూ ఆడుకున్న పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడో ఆమెకి అర్థంకాలేదు.

మరుసటిరోజు ఉదయం ఆ విషయం పొరుగింటి పుల్లమ్మతో చెప్పగా "దాందేముందమ్మాయి, ఏ తల్లి చూపో పడుంటుంది. దిష్టి తగిల్తే అంతే. పిల్లలకు నిద్రాహారాలుండవు. అగ్గురోరం నారాయణస్వామి కాడికి తీసుకపోయి దిష్టిదారం వేయించు. కుదుటపడిద్ది" అంది పుల్లమ్మ.

మళ్ళీ ఆవిడే "ఆమధ్య మా బర్రెపడ్డ సరిగా పాలు ఇయ్యాలా, మేత మేయలా. ఏ తల్లి దిష్టి తగిలిందోనని, ఆదివారం పోయి తాడుకు మంత్రం పెట్టిచ్చుకొచ్చి దాని మెడలో కట్టా. తాడు కట్టానో లేదో పాలు ఎప్పటి మాదిరిగానే ఇస్తోంది, మేత మేస్తోంది. అబ్బో, ఎక్కడెక్కడినించో జనాలు వస్తుంటారు. డబ్బులు కూడా పెద్దగా పుచ్చుకోడు. కొబ్బరిచిప్పలో ఆకూ వక్కా పండు వుంచి, మన శక్తి కొద్దీ పదో పాతికో రొక్కం ఇస్తే చాలు" అంటూ చెప్పింది పుల్లమ్మ చాలా ఉత్సాహంగా.

ఆదివారం సుబ్బులు చీకటితోనే నిద్రలేచి స్నానాలు ముగించి, అక్కడికి పదిమైళ్ళ దూరంలో ఉన్న అగ్రహారానికి వెళ్ళింది. నారాయణస్వామి వుంటోంది చిన్న పెంకుటింట్లో. ఇంటిముందు పంచలో రకరకాల దేవుడి పటాలు ఆ చివరనించీ ఈ చివర వరకూ గోడల నిండా మేకులకు వేలాడదీశాడు. ఆయన సాదాసీదా దుస్తులతో, గడ్డాలు మీసాలు పెంచి, భుజం మీద కాషాయ కండువా వేసుకున్నాడు. పుల్లమ్మ చెప్పినట్లుగానే ఎందరో వచ్చారు, ఇంకా వస్తున్నారు.

"మీదే వూరు? ఎందుకొచ్చావు?" తన పక్కనే కూర్చున్న ఒకామెని అడిగింది సుబ్బులు.

"నాది మూడు సవర్ల గొలుసు పెట్టెలోంచి మాయమైపోయింది. దాన్ని కాజేసింది మా ఇంటి పక్క లచ్చిగాడే అని నా అనుమానం. వాడు నాకు తెలీదంటున్నాడు. పస్తీ చెప్పించుకుందామని వచ్చాను" చెప్పిందామె.

పస్తీలు, వాస్తు చెప్పించుకునేవాళ్ళు, రోగాలు, బాధలతో వచ్చినవాళ్ళూ... ఇలా అనేకమంది.

'ఈ సామిలో ఏదో గొప్పదనముంది. లేకపోతే ఇంతమంది ఎందుకొస్తారు?' అనుకుంది సుబ్బులు. నారాయణస్వామి పనీపాట చేసే రకం కాదు. బొత్తిగా చదువబ్బలేదు. వెనుక ఆస్తిపాస్తులూ లేవు. మాటలపుట్ట. ఉన్నవీ లేనివీ, అబద్ధాలూ సబద్ధాలూ తడుముకోకుండా, అసాధారణంగా ఇష్టారాజ్యంగా కథలు చెప్పడంలో మొదట్నించీ మొనగాడు. ఊళ్ళో అంతా ఇతన్ని కంత్రీగాడంటారు.

పని చేయకుండా, సులభంగా డబ్బెలా సంపాదించాలా అని చాలాకాలం ఆలోచించి, చివరికి దారాలు, మంత్రాలు, చేసే పని అయితే బాగుంటుందని పెట్టుబడిలేని ఈ వ్యాపారంలోకి దిగాడు. మన జనం చాలా అమాయకులు కదా. నెలకు తేలికగా నాలుగైదువేలు సంపాదిస్తున్నాడు.

సుబ్బులు వంతు వచ్చేసరికి మధ్యాహ్నమయింది. స్వామి ఇంటికి ఎదురుగా ఉన్న కొట్లో కొబ్బరి చిప్పలు, ఆకులు, వక్కలు, రెండు అరటిపండ్లు కొని, అందులో 20 రూపాయల నోటుంచి, పిల్లవాడ్ని తీసుకుని, స్వామి దగ్గరికెళ్ళి, ఎదురుగా ఉన్న పీటమీద కూర్చుంది.

"ఏమ్మా, విషయం ఏమిటి?" అడిగాడు స్వామి.

సుబ్బులు చెప్పింది.

"నీకు పిల్లలెంతమంది? వీడు ఎన్నోవాడు? మీ ఆయన ఏం చేస్తుంటాడు?" ఆత్మీయత వలకబోస్తూ ప్రశ్నలు సంధించాడు.

జ్యోతిష్యం, వాస్తు, భవిష్యత్ అన్నీ చెప్పగలిగిన స్వామి ఆమెకు ఎందరు పిల్లలో, భర్త ఏం చేస్తుంటాడో, వర్తమానం ఏమిటో తెలీదు మరి.

వివరంగా చెప్పింది సుబ్బులు.

"ఇదిగో... ఈ దారం తీసుకుపోయి మెడలోకట్టు. హాయిగా నిద్రపోతాడు. ఇక ఏడుపు అంటే తెలీదు. ఈసారి ఆదివారం రా!" అంటూ పసుపు పూసిన ఒక దారం ఇచ్చాడు. దారాన్నిచ్చేపుడు పెదాలు కదిలిస్తూ, ఏవో మంత్రాలు గునగునాయించాడు.

ఆమె దారం పిల్లవాడి మెడలో కట్టి, ఇంట్లోంచి వీధిలోకి వచ్చింది. అప్పుడే అతివేగంగా ఒక ఆటో వచ్చి అక్కడాగింది. ఆటోలోంచి సుబ్బులు వాళ్ళ పొరుగింటివాళ్ళు ఆరుగురు దిగారు.

పొరుగింటి పుల్లమ్మ మామగారు నారాయణకు గడ్డివామి దగ్గర్నించి పుల్లలు తెస్తుండగా, అక్కడే ఉన్నపాము కరిచింది. ఆలస్యం చేయకుండా ఆయన్ను ఆటోలో ఎక్కించుకుని, మంత్రం వేయించటానికి తీసుకొచ్చారు.

మనిషి ప్రమాదంలో ఉండటంతో అందరూ తప్పుకుని ముసలాయన్ను స్వామిదగ్గరికి తీసుకుపోయారు. అప్పటికే ముసలాయన నోటినించి కొద్దికొద్దిగా నురుగపడటం ప్రారంభమైంది.

"మీరేం భయపడకండి. ఏం కాదు, మంత్రం పెడుతున్నాకదా" అంటూ స్వామి మంత్రం పఠిస్తూ ఏదో దారం కట్టి "సాయంత్రం వరకూ మంచినీళ్ళు తాగించకండి, ఏంకాదు" అంటూ వాళ్ళని పంపించాడు.

పాముకాటులాంటి ప్రాణాంతకమైన, భయంకరమైన విషయానికి కూడా మన ప్రజలు, మంత్రాలు, తంత్రాలు లాంటి మౌఢ్యంలో కూరుకుపోయి ఉన్నారంటే అజ్ఞానం అనేది ఎంత తీవ్ర స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆటో తిరిగి వెళ్ళిపోయింది.

ఆ ఆటోలో ఖాళీ లేకపోవటంతో, సుబ్బులు బస్ వచ్చేవరకు ఆగి పిల్లవాణ్ణి తీసుకొని ఊరికి వచ్చేసింది.

సుబ్బులు వచ్చేసరికి, వాళ్ళ పొరుగింటి ముందు జనం గుంపులుగా వున్నారు. దారిలోనే ఆయన ప్రాణం పోయిందట.

'దారం వేయిస్తే ఏం ఉపయోగం కనపడింది? కనీసం ఆస్పత్రికి తీసికెళ్ళినా బాగుండేదేమో! చూస్తూచూస్తూ ప్రాణం పోగొట్టారే!' సుబ్బులు మనసులో అనుకుందేగానీ పైకి వెల్లడించలేకపోయింది. ✤

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు
న్యాయ సంబంధమైన
ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం
చేయాలో పాలుపోక
సతమతమవుతున్నారా? అయితే వెంటనే
ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి.
న్యాయవాది
శ్రీ జి.ఎల్.నరసింహారావు
తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.
మా చిరునామా:
ప్రజాశక్తి ఆదివారం అనుబంధం,
ఫ్లాట్ నెంబర్ 1,
... హైదరాబాద్ - 500 020.

విడాకులు ఇవ్వమంది

నేను గవర్నమెంటు ఎలిమెంటరీ స్కూల్లో పన్నెండు సంవత్సరాల నుండి పని చేస్తున్నాను. నా పెళ్ళయి ఎనిమిది సంవత్సరాలయింది. ఆమె కూడా టీచర్, వేరే ఊళ్లో చేస్తోంది. మూడు సంవత్సరాల క్రితం మా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. మాకు ఇద్దరు మగ పిల్లలు. ఆమె దగ్గరే ఉన్నారు. ఆమె నాపై లేనిపోని అనుమానాలు పెట్టుకొని కేసు పెట్టింది. ఆ కేసు నుండి బెయిల్ మీద వచ్చి నా ఉద్యోగం నేను చేస్తున్నాను. పెట్టిన కేసు కోర్టులో నిలవదు అంటున్నారు. నన్ను సాధించాలని బి.సి. సర్టిఫికెట్లు (క్యాస్టు) అన్నీ ఎప్పుడు తీసుకు వెళ్ళిందీ మాకు తెలియలేదు. ఆమె ఇప్పుడు ఆ బి.సి. క్యాస్టు సర్టిఫికెటు ఆర్.డి.ఓ ఎంక్వయిరీకి పెట్టింది. మా ఆయన దొంగ సర్టిఫికెట్లు పెట్టి బి.సి. కోటాలో ఉద్యోగం సంపాదించుకున్నాడు, అతన్ని ఉద్యోగంనుండి తొలగించండి అని ఆర్.డి.ఓ గార్కి అర్జీ పెట్టింది. నేను ముస్లిం కులానికి చెందిన దూదేకుల కేటగిరీవాడిని కాదని అర్జీలో రాసింది.

ఎం.ఆర్.ఓ గారు వచ్చి మాది ముస్లిం కుటుంబమని రాసుకొని వెళ్ళి ఆర్.డి.ఓ గార్కి ఇచ్చారు. దీనిపై ఆర్.డి.ఓ. గారు విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో నా ఉద్యోగం తీసేస్తారేమోనని నాకు భయం వేస్తోంది. తీసివేస్తే నేనేం చేయాలో తగిన సలహా ఇవ్వగలరని మనవి చేసుకుంటున్నాను.

నేను డిగ్రీలో, బిఇడిలో బిసి సర్టిఫికెట్లు పెట్టుకుంటూ వస్తున్నాను. అలాగే టీచరు ఉద్యోగాలలో సబ్‌మిట్ చేశాను. ఉద్యోగం వచ్చింది. నా భార్య విడాకులు ఇవ్వమంది. నేను ఇవ్వనని అన్నందుకు ఇలా చేస్తోంది. సలహా ఇవ్వగలరు.

షేక్ రఫీ, గుంటూరు

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది
9848994240

మీరిద్దరూ విద్యాధికులు. సమాజానికి నడక నేర్పే గౌరవప్రదమైన వృత్తిలో ఉండి, కుటుంబంలో మీ పిల్లలకు ఊహ తెలిసే వయసు వచ్చాక ఇప్పుడు తగాదాలు పెట్టుకొని.. మీరు, మీ కుటుంబం బజారునపడటం ఎందుకు? అంతదాకా వచ్చేవరకు మీమీ లోపాలు సరి చేసుకోకపోవడం ఇద్దరూ చేసిన పొరపాటు.

మీరు ముస్లిం అయివుండి, అందులో దూదేకుల (బిసి) అని తప్పడు కుల ధృవీకరణ)తో మీరు ఉద్యోగం పొంది ఉంటే... అది చట్టప్రకారం నేరమవుతుంది. ఉద్యోగం కోల్పోవడమే కాకుండా క్రిమినల్ చర్య కూడా తీసుకునే అవకాశం ఉంటుంది. మీరు ఆర్‌డిఓ గారి విచారణలో పాల్గొని మీకున్న ఆధారాలు చూపిస్తూ ఏదైనా పత్రాలు, సాక్షులు ఉంటే ప్రవేశపెట్టండి. అప్పటికీ మీకు న్యాయం జరగలేదని అనిపిస్తే జాయింట్ కలెక్టర్‌గారికి గాని, రాష్ట్ర రెవెన్యూ కమిషనర్‌గార్కి గాని ఆ ఆర్డర్‌లో అప్పీలు చేసుకొని దానిని సస్పెండ్ చేయించుకోండి. అలా అప్పీలు పెండింగ్ ఉన్నందున మీ డిపార్ట్‌మెంట్‌లో వారు మీ ఉద్యోగంపై ఏ చర్యా తీసుకోకుండా తాత్కాలికంగా ఉపశమనం పొందగలుగుతారు. రెవెన్యూ విచారణలో మీరు తప్పడు కుల ధృవీకరణ పత్రాలు పెట్టి ఉంటే మీ ఉద్యోగాన్ని కూడా కోల్పోవలసిందే.

జాగ్రత్త

"ఈ మాత్రలన్నీ ఖచ్చితంగా మీరు చెప్పినట్టే వాడాలా డాక్టర్‌గారూ?" పేషెంట్ పదే పదే అడగటంతో విసుగొచ్చిందాయనకి.

"ఏమక్కర్లేదు. మీకు తోచినట్లే వాడండి. మళ్ళీ జబ్బు తగ్గలేదని నా దగ్గరి కొచ్చారో, మిమ్మల్ని అవసరం లేకపోయినా ఆపరేషన్ టేబులెక్కించేస్తాను" అన్నాడాయన.

- శ్రీకృష్ణ వరప్రసాద్

ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

వంటపని-వింతమనిషి

ప్రమీలకి ఆరోజు ఆనందంగానే ఉంది. పూర్తిగా ఆనందమనడానికీ వీల్లేదు. లోపల్లోపలెక్కడో కొంచెం భయం కూడా ఉంది. భయానికి, ఆనందానికీ మధ్యన ఊగిసలాడే ఆ పరిస్థితి ఏమిటంటే పాత వంట మనిషి మానేసి వారం తిరక్కుండానే కొత్త మనిషి కుదిరింది. అందుకెంతో ఆనందం. ఇక వచ్చిన ఈ కొత్త మనిషి ఎలా చేస్తుందో, ఇంట్లో అందరికీ నచ్చుతుందో లేదో, ఏమైనా సమస్యల్ని తీసుకొస్తుందేమోననే భయం. మరుసటిరోజు ఉదయంనుండి పని మొదలుపెడతానని మాట్లాడుకు వెళ్ళింది మాలక్ష్మి.

ప్రమీలకి ఈమధ్య ఇంటి పనంతా ఒంటరిగా చెయ్యాలంటే చేతకావడం లేదు. మంచంలో ముసలి అత్తగారు, ఆమెకన్నీ అమర్చాలి. టిఫిన్లు, కాఫీలు, భోజనం, ప్రత్యేక మజ్జిగలు, మందులు, అదీకాక ఇద్దరు పిల్లలు కాలేజీలకు వెళ్ళాలి. మొగుడుగారి పనులు అనంతంగా ఉంటాయి. ఇవన్నీ చూసుకోవడం మహాకష్టం ప్రమీలకి.

వంటమనిషి వంట, మిగిలిన పనులు పనిమనిషి చేసినా, ప్రమీలకు క్షణం తీరిక లేకుండా ఉన్నట్టనిపిస్తుంది. ఇల్లన్నాక వచ్చేపోయే అతిథులు, చెప్పి వచ్చే స్నేహితులు, చెప్పకుండా వచ్చే చుట్టాలు మామూలే. అందుకే వంట మనిషి మానెయ్యగానే బెంగ పెట్టేసుకుంది ప్రమీల.

తను ఇంకా నిద్రపక్కమీంచి లేవకుండానే వచ్చేసి మాలక్ష్మిని చూసి, మురిసిపోయింది ప్రమీల. వస్తూనే ఆమె చకచకా పనుల్లో పడింది. ఇదీ బాగానే ఉందనుకుంది. తను ఇంట్లో అందరికీ కాఫీ కలుపుతూ "కాఫీ తాగుతారా?" అంది ప్రమీల. "అబ్బే! వద్దమ్మా" అందామె. "పోనీ టీ పెట్టుకు తాగండి" అంది ప్రమీల.

''ఇంటి దగ్గర ఒకసారి తాగుతానంతే"

"సరే, మళ్ళీ తాగాలనిపిస్తే పెట్టుకుని తాగండి"

అంతే మాలక్ష్మి చిన్న ఉపన్యాసం మొదలుపెట్టింది.

''నాకలాంటి ఇలాంటి అలవాట్లు లేవమ్మా. నాకు టీలు, కాఫీలు ముఖ్యం కాదు, పని ముఖ్యం. ముందు పని పెట్టుకుని, అవీఇవీ తాగుతూ, తారాడుతూ ఉండటం, అబ్బే! నాకసలు గిట్టదు" అంటూ ఒకసారి ఒళ్ళు జలదరించింది.

ఆ అభినయానికి ప్రమీల అవాక్కయింది. సరేలే ఏదో పని చేసుకు పోతోంది కదా అని సరిపెట్టుకుంది. ఇంక మాలక్ష్మి టిఫిను తినమంటే "ఏంటమ్మా ఒకపక్కన పని కాక అవస్థ పడుతుంటే అవి తినూ, ఇవి తినూ అంటూ గొడవ చేస్తావ్. ముందర పని కానీ" అంటూ కదలిపోయింది. ప్రమీలకి ఏమీ అర్థం కాలేదు. సరేలే ఆకలనిపించినపుడు తనే తింటుంది అని ఊరుకుంది. విచిత్రంగా ఆవిడ ఏమీ తినకుండా ఒంటి గంటవరకు పనిచేసి, ప్రమీల బలవంతం మీద కాస్తంత కాఫీ తాగి వెళ్ళిపోయింది.

మొదటిరోజు కదా గొప్పలు పోతోందనుకుంది ప్రమీల. కానీ ఆమె అదే పద్ధతిని అనుసరించటం మొదలుపెట్టింది. ప్రమీలకేమీ అర్థం కాలేదు. ఆమెకష్టమాను టిఫిను తిను, అన్నం తిను, కాఫీ తాగు అని చెప్తూ వెంటబడి, బతిమాలి సాగతీయాలని అర్థమైంది. సాధారణంగా వంట పనికి వచ్చే వాళ్ళు అవీఇవీ చాటుగా తింటారనీ, వాళ్ళనుంచి పదార్థాలను కాపాడ్డం కష్టమనీ అంటారు. కానీ ఈ మాలక్ష్మి దానికి విరుద్ధం. ఇక్కడ ప్రమీల మనస్తత్వం కూడా సున్నితం. ఏమీ తినకుండా గంటలు గంటలు పని చేస్తుంటే ఆమె తట్టుకోలేక పోయేది. ఇంక తోచినపుడల్లా వంటింట్లోకి వెళ్ళి టిఫిను తిన్నారా అని అడగడం, ఎక్కడ పెట్టిన టిఫిన్ ప్లేటు అక్కడే ఉండటం, ఏమిటిదని కేకలేస్తే, 'అబ్బో తింటా?? నాకొద్దు తల్లీ.. నాకేం తినకపోయినా ఫరవాలేదంటూ మొదటికొచ్చేది మాలక్ష్మి. పని బాగానే చేస్తుంది. వంట చేసి వెళ్ళిపోయే విధంగా మాట్లాడుకున్నప్పటికీ ఉదయం చేసే ఫలహారం కూడా తినకుండా ఉండటం ప్రమీల తట్టుకోలేక పోతోంది. ఎవరికైనా చెప్తే, పోనీ ఆమె కడుపు మాడితే తింటుంది. నువ్వేం తినొద్దనలేదు కదా- అనేవారు.

ప్రమీలకావాదం తృప్తి నివ్వలేదు.

మాలక్ష్మికి చదువు లేదు, జ్ఞానం లేదు, చెప్తే వినే బుద్ధిలేదు. గట్టిగా చెప్పబోతే పెద్దకులంలో పుట్టిన వాళ్ళం తిండి గురించి ఆలోచించం. నాకు ఏమీ తినకపోయినా ఫరవాలేదని తేల్చింది. అదీ కాకుండా ఆమె మాటల్లో అర్థమైందేమిటంటే ఆకలి వేస్తోందనడం నీచమైన మాట. విశ్రాంతి కావాలనడం చేతకానితనం, నిద్ర అనేది దరిద్రలక్షణం. ఇవన్నీ తనకు లేవు. ఆ లక్షణాలు ఉంటే అవి తన కుల ప్రతిష్టకు, వంశ గౌరవానికి భంగం అని చెప్పింది.

ఆమె ఇంతవరకు ఎక్కడా ఏ విధమైన ఉద్యోగం, పనీ చెయ్యలేదు. జీతంకోసం చేస్తున్నప్పటికీ అది కేవలం ఎదుటివారి కోసం చేస్తున్నాననే అహంభావంతో మెలిగేది. ప్రమీల ఎంత కష్టపడి బోధలు చేసినా ఆమెని మార్చలేక పోయింది.

నెల్లాళ్ళు గడిచాయి. మొదటి నెల జీతం తీసుకుని మంచానపడింది. తిండి లేక నీరసించి పోయింది. తమ ఇంట్లో వంట చేసి ఆ విధంగా అవడం ప్రమీలకెంతో బాధ కలిగించింది. కానీ అసహాయంగా ఉండి పోయింది. ఆ తర్వాత మరో మనిషి దొరికినా ఈ వింత వంట మనిషిని ప్రమీల ఎప్పటికీ మర్చిపోలేదు.

✤

ఇలా వుందామా...

వి. నాగరత్న

పెరటి చెట్టు

మా చినమావయ్య ఊళ్ళో ఎవరికైనా చెవి పోటొచ్చినట్లయితే చెవిలో పసరు పోసి తగ్గించేవాడు. ఒకసారి నాకు చెవిలో పోటు రావడంతో "కాసేపట్లో ఆకుపసరు తెచ్చి పోస్తాగా, ఏం కంగారుపడొద్దు" అని చెరువుగట్టుకు బయల్దేరాడు. అంత నొప్పిలోనూ అదేం క్యూరియాసిటీనో గానీ "నేనూ వస్తా మావయ్యా" అన్నాను. "అబ్బే, నువ్వొద్దు, నే తెస్తాగా" అనేసి వెళ్ళిపోయాడు. "పెద్ద గొప్ప కాకపోతే నన్నూ తనతో తీసికెళ్ళొచ్చుగా..." అన్నాను అమ్మమ్మతో. "పిచ్చిదానా, ఆ మొక్కను నువ్వు చూశావంటే ఇక నీకా మందు పనిచేయదు" అంది అమ్మమ్మ. మొత్తానికి ఆ ఔషధచెట్టేదో తెలుసుకుని ఆ పసరు నేనూ పోసి వీరవైద్యురాల్ని కాలేకపోయానన్న బాధ తప్పిస్తే అప్పట్లో అమ్మమ్మ మాటలు నాకేం అర్థంకాలేదు.

❖ ❖ ❖

రాఘవయ్యగారు ఒక ప్రైవేట్ స్కూల్లో లెక్కల మాస్టారుగా పనిచేస్తున్నారు. పిల్లలు ఆయన్ను విపరీతంగా ఇష్టపడతారు. ఆయన టాలెంట్ చూసి మేనేజ్‌మెంట్ కూడా జీతం అందరికంటే ఎక్కువిచ్చి ఆదరిస్తున్నది.

వితండవాదం

విజయవాడ బస్‌స్టాండ్. తను ఎక్కే బస్ కోసం ఎదురు చూస్తున్నాడో స్టూడెంట్. మురికి బట్టలు, జిడ్డు మొహం మనిషి ఒకడు తూలుతూ దగ్గరికొచ్చాడు.

"ఆ బస్ హైద్రాబాద్ వెళ్తుందా?" అనడిగాడు

"వెళ్తుంది" చెపాడు స్టూడెంట్.

"వైజాగ్?"

"వెళ్ళదు."

"హైద్రాబాద్ వెళ్లే బస్ వైజాగ్ ఎందుకు వెళ్లలేదు? పెట్రోల్ సరిపోదా? టైరు పంచరవుతుందా?" వాదించటం మొదలెట్టాడా మనిషి.

అప్పటికి అతని వాలకం అర్థమైంది స్టూడెంట్‌కి "ఆ బస్ పెట్రోలే తాగుద్ది, నీలా మందు కొట్టదు గనక" అన్నాడు చిరాగ్గా.

- శ్రీకృష్ణ వరప్రసాద్

ఆవేళ మిత్రుడు శ్రీపతిని "నీకు తెలిసిన మంచి ట్యూటరెవరైనా వుంటే చెప్పవయ్యా, మా వాసుకోసం" అన్నాడు రాఘవయ్య.

"ఏ సబ్జక్టు?"

"మాథ్స్"

"అంత అలిసిపోతున్నావా? నువ్వే చెప్పొచ్చుగా"

"పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదని తెలీదా?"

"చాల్లే ఊరుకో, నిన్ను మించిన లెక్కల పండితుడెవరు?"

"నేనెవరికైనా పాఠాలు చెప్పగల్ను కానీ నా పుత్రరత్నానిక్కాదులేవో" అని నవ్వేశాడు.

❖ ❖ ❖

ఈశ్వర్రావు జనరల్ ఫిజీషియన్. ఆయన దగ్గరకు ఎక్కడెక్కణ్ణించో రోగులు వస్తుంటారు. కానీ వాళ్ళావిడకు మాత్రం ఆయన వైద్యంపట్ల పెద్దగా నమ్మకం వుండదు. ఒంట్లో బాగోనపుడు మెడికల్ రెప్స్ ఇచ్చిన శాంపిల్స్ ఎటూ సిద్ధంగా వుంటాయి గనుక ఆయనేమైనా మందు ఇవ్వబోతే "మీరేం కోపం తెచ్చుకోవద్దు గానీ, నేను సుష్మాదేశాయ్‌కి చూపించుకుంటాను" అనేస్తుంది. ఈశ్వర్రావేం కోపం తెచ్చుకోడు. సుష్మాదేశాయ్ క్లినిక్ తమ ఇంటికి చాలా దగ్గరే కనుక "సరే, వెళ్ళు" అని నవ్వి తన మానాన వెళ్ళిపోతాడు.

❖ ❖ ❖

అవునా? నిజంగానే పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదా?

తాజ్‌మహల్ని చూట్టానికి ఎక్కడెక్కణ్ణించో జనాలు వస్తారు. ఒకవేళ మనిల్లు ఆగ్రాలోనే వుంటే దానిపట్ల అంతగా మోజుండదు. కానీ అంతమాత్రాన తాజ్‌మహల్ గొప్పతనం ఏమైనా తగ్గుతుందా? అది చూడదగ్గ ప్రదేశం కనుక ఒకసారో, పదిసార్లో చూశాక దానిమీద అంతగా వ్యామోహం వుండదు. కానీ ప్రావీణ్యమున్న వ్యక్తులు మనవాళ్ళయినంతలో, రోజూ మనతో కలిసి వుంటున్నంతలో వారి గొప్పతనం తరిగిపోదుగా! ఎప్పుడూ చూసేవాళ్ళేగా, వీళ్ళేం చేస్తార్లెమ్మనుకుంటే వాళ్ళను మనం వినియోగించుకోలేం. ఉచితంగా ఇచ్చినంతలో ఎం.ఎఫ్. హుసేన్ పెయింటింగ్ విలువ లేనిదౌతుందా? ఆ.. ఏముందిలెద్దూ అనగలమా?! ♣

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(గతవారం)

తనవాళ్లు ఎలా ఉన్నారంటూ ఏసురత్నాన్ని ప్రశ్నించాడు కోదండరాంరెడ్డి. అతను చెప్పిన విషయాన్ని విని అవాక్కయ్యాడు. మంటల్లో ఇల్లు తగులబడడం కళ్లారా చూశాడు. అతని మనసు వికలమైంది. ఇక ఆ ఊరితో తనకు రుణం తీరిపోయిందంటూ దక్షిణ దిక్కుగా సాగిపోయాడు కోదండరాంరెడ్డి.

(42వ భాగం)

"వాళ్ల మొగమేంకాదూ? మూడు పాళ్లు మనకు, వాళ్ల కొకపాలని చెప్పమన్నానుగా"

"ఆ మాటలకు వాళ్లు ససేమిరా ఒప్పుకోమన్నారు. కష్టపడేది మేమయితే మీకు ఎక్కువ భాగం ఎందుకిస్తాంఅన్నారు"

''లంజాకొడుకులు'' అని పళ్లు నూరుతూ తలూపాడు పటేలు.



"ఒక్కసారిగా మిలట్రీని తీసుకుపోయి వీపులన్నీ విమానం మోత పుట్టించినట్టయితే వాళ్ల తిక్క కుదిరేది. అయితే ఇంతకూ ఏమని ఖరారుపడివచ్చావు?" అడిగాడు తిరిగి.

"దొరికిన సొమ్ములో సగభాగం మనకు ఇచ్చేట్టు, మిగతా సగం వాళ్లు ఉంచుకునేట్టుగా ఖరారు చెప్పి వచ్చాను"

పటేలు తలూపాడు. కాసేపు ఆలోచనలో పడ్డాడు. చివరికి "సరే పోనీలే. మాటిచ్చి వచ్చావు గదా, మరి మిగతా విషయాలు కూడా వివరంగా చెప్పివచ్చావా?" అన్నాడు.

"అన్నీ చెప్పాను, వాళ్లందరూ ఇవ్వాళల్లా ఈ ఏర్పాట్లలోనే ఉన్నారు. మనిషికొక సంగం జెండా కుట్టించుకుంటున్నారు కూడా. కానీ సంగం వాళ్లు కేకలు వేసినట్లు మాకు చేతకాదని చెప్పారు"

"దానిదేముందిరా? సంగం జిందాబాద్ అని అరవడమేగా"

"నిజమే అయ్యగారూ, కానీ ఈ యానాదినాయాళ్లకు ఆ మాటలూ నోటబట్టవట"

"సరే నువ్వున్నావుగా? ఆ మాత్రం ఒకమాట గుర్తుంచుకుని కేకలు వేయించలేవా?"

''ఒక్కమాటయితే బాగుండును దొరా! సంగం జిందాబాద్ అని అరిస్తే చాలు సంగం వాళ్లే వచ్చారని అనుకుంటారు"

"సరేలెండి అయ్యగారూ, అంతకు కాకపోతే మా పెద్దపోరదు ఏసోబుగాణ్ణి వెంటేసుకుని పోతాం. వాడయితే అచ్చు సంగం వాళ్ల మాదిరిగానే కేకలు వేస్తాడు"

"నిజమేరా రూబేనూ, యేసేబుగాడయితే అచ్చు సంఘం నాయకుడి మాదిరిగాను ఉంటాడు"

ఈ విధమైన సంభాషణ వారిద్దరి మధ్యన సాగింది. అప్పటికి కనుచీకటి పడుతోంది. రూబేను లేచి నిల్చున్నాడు.

"ఇక ఎల్తా అయ్యగారూ, మనికొండ అక్కడికి చాలాదూరం ఉంది. పెందలాడే బయల్దేరి ఈ యానాది మూకంతటినీ తీసుకుని వెళ్లాలి గదా" అన్నాడు.

"సరే! వెళ్లు. కానీ వాళ్లసలే యానాది లంజాకొడుకులు, దోచుకున్నదంతా మాటిపారవేస్తారు. వాళ్లను వేయి కళ్లతో కనిపెట్టి ఉండాలి జాగ్రత్త''

"వేయి కళ్లేమిటి దొరా? పదేలకళ్లతో కావలా కాస్తాను'' అని అతడు అక్కడ్నించి వెళ్లిపోయాడు.

పటేలు లేచి నెమ్మదిగా ఇంట్లోకి వచ్చాడు. మసాలా వాసన గుప్పించి కొడుతోంది. కొంగమాంసం కుతకుతలాడుతూ వుడుకుతోంది. గదిలోకి తొంగిచూశాడు. కాశింసాహెబ్ గరిటనిండా కండలు వేసుకుని నంజుతున్నాడు.

పటేలు నవ్వి "కాశింగారూ, నీవొక్కడివే కండలన్నీ కాజేస్తున్నావా? మరి ముస్సేనుగారేడీ?" అన్నాడు.

"బడేమియాసాబ్ వచ్చినరుగదా? ఆయన పిలిస్తే బయటికి వెళ్లి మాట్లాడుతున్నాడు" అన్నాడు కాశింసాహెబ్.

"ఏమిటీ? బడేమియా గారొచ్చారా?'' అంటూ పటేలు అదుర్దాగా బయటకు నడిచాడు.

బడేమియా, హవల్దారు మొదలగు వారంతా ఉన్న చోటుకు వచ్చాడు. వారంతా వారి బాషలో ఏదో మాట్లాడుకుంటున్నారు.

పటేలు మాత్రం బడేమియాకు ఎదురుగానిలబడి ''సలాం బడేమియాగారూ!" అన్నాడు.

బడేమియా తలూపాడు.

“రేపు వస్తారని మేమనుకుంటున్నాం. కానీ మీరు ఇవాళే వచ్చేశారు, సంతోషం” అన్నాడు పటేలు తిరిగి.

బడేమియా తిరిగి తలూపాడు. “అసల్ మాటయితే నేను ఇక్కడ్కి రేపు రావడం ఉండెను. కాని మన్కొండ దేశ్‌ముఖ్‌వల్న ఇవ్వాళ్నే రావడం పడింది” అన్నాడు.

“మనికొండ దేశ్‌ముఖా?” అన్నాడు పటేలు. అతడి ముఖం వెలవెలబోయింది. కానీ అతడి ముఖం ఆ చీకటిలో ఎవరికీ కనిపించలేదు.

“ఆ దేశ్‌ముఖ్‌గార్ మీకు తెల్సా పటేల్‌జీ? ఆయన మీ రెడ్డిసాబే” అన్నాడు బడేమియా.

“ఎందుకు తెలియదు? బాగానే తెలుసును” అన్నాడు పటేలు ఎవరికీ వినిపించకుండా పళ్లు పటపట నూరాడు.

“ఇంతకూ ఆయన ఏమంటాడు?” అడిగాడు తిరిగి.

“సంగంవాళ్ల గురించి భయమవుతాందనీ, గడీలో ఎప్పుడూ పదిమంది సిపాయిల్ కావాలని సర్కార్‌కి దరఖాస్తు చేసినాడు” అన్నాడు బడేమియా.

“అట్లా ఉంచడానికి మీరు సమ్మతించారా?” అన్నాడు పటేలు.

‘మాకీ సమ్మతి ఏమివుంటది? ఆఫీసర్‌సాబ్‌కా సమ్మతి అయింది. మన్కొండ గడీకి పదిమంది సిపాయిల్‌ను పంపించాలని హవల్దార్‌సాబ్‌కు ఖత్ రాసినదు”

“ఇక్కడనుంచి సిపాయిలను పంపితే మనకు బలం తక్కువగా ఉండదూ?”

బడేమియా చప్పరించి “బలం తక్వా ఏమీ ఉండదు. పదిమంది అక్కడ్కిపోతే ఇంకో పదిహేనుమంది సిపాయిల్ ఇక్డా ఉంటరుగదా? మన్కీ హేమీ భయం. అదీగాక ఈ ప్రాంతంలో ఎక్డా సంగంవాళ్లు పత్తాలేకుండా పోయినరు గదా?” అన్నాడు.

పటేలు తలూపి “సరే మీ ఇష్టం” అన్నాడు. తర్వాత ఏమీ మాట్లాడకుండా ఇంట్లోకి వచ్చాడు. మధ్యహాల్లో కాస్సేపు పచార్లు సాగించాడు. వంకెకర్రను చేతికి తగిలించుకుని అంత చీకటిలోనూ వాడకేసి బయల్దేరాడు. రూబేను ఇంటిముందుకొచ్చి నిల్చున్నాడు.

“రూబేనూ” అంటూ పిల్చాడు.

లోపల భోంచేస్తున్న రూబేను ఎంగిలి చేత్తోనే వెలుపలికి వచ్చాడు. “ఏమిటి దొరా మీరే సాయంగా వచ్చినరూ?” అన్నాడు.

“ఒక్కమాట చెప్పిపోదామని వచ్చాన్రా. మనం అనుకున్న పని ఈ రాత్రే తప్పకుండా జరిగితీరాలి. ఈ రాత్రి గనుక తప్పించారంటే గడీమీదకి పోలేం. రేపటినుంచి మిలట్రీ కాపలా ఉంటుంది”

“ఈ రాత్రికి ఎందుకు ఆగుతాం దొరా? ఇక బయల్దేరుతున్నాం గదా?”

“బయల్దేరితే మంచిదేననుకో. కానీ ఏ కారణాలవల్లనయినా ఆగిపోతారేమోనని వచ్చాను”

“ఇయ్యాల ఆగడం అనేది లేదు దొరా. యానాదిగూడెం గుంపు ఎనభైమంది వచ్చి నల్లచెరువులో గట్టుపొదల్లో కాసుక్కూర్చున్నారు. కబురుకూడా వచ్చింది”

“భేష్‌రా రూబేనూ. ఇక నేనింటికి వెళ్తాను. కానీ, రేపు రాత్రికి మూటలెత్తుకుని మా తోటలోకి రా”

“సరే దొరా”

తర్వాత పటేలు ఇంటికి తిరిగొచ్చాడు.

❄❄❄

మరునాడు ఉదయం నాలుగుగళ్ల పొద్దు ఎక్కింది. కాఫీ, ఫలహారాలు తీసుకోవడం పూర్తయింది. అందరూ పటేలు ఇంటిముందు వరండాలో తీరిగ్గా కూర్చున్నారు. కానీ మనికొండ గడీకి బయల్దేరుతున్న సిపాయిలు ప్రయాణ సన్నాహంలో హడావిడి పడుతున్నారు.

“పటేల్‌సాబ్” అని పిల్చాడు బడేమియా.

దూరంగా ఉన్న పటేలు బడేమియాకు సమీపంలో వచ్చి కూర్చున్నాడు. “ఏమిటి బడేమియాగారూ?” అన్నాడు.

“ఒక్క మంచిమాట ఉంది పటేల్‌సాబ్. మీకీ చెప్తామని అన్కుంటూ ఉండడంతోనే మాది ఛోటాసాబ్ చచ్చిపోయినదు. మేం ఇక్కడ్నించి వెళ్లిపోవలసివచ్చినది” అన్నాడు బడేమియా.



“ఏం మాట అది? త్వరగా చెప్పండి. వినాలని కుతూహలంగా ఉంది” అన్నాడు పటేలు నవ్వుతూ.

బడేమియా కూడా ముందు చిరునవ్వును చిందించాడు. కానీ అంతలోనే కోపోద్రిక్తుడయిపోయాడు. “కోదండరాంరెడ్డి పంటలన్నిట్నీ మనం కాలుకిచ్చేద్దాం. ఏమంటరు?” అన్నాడు.

ఆ మాటతో పటేలు నోరూరింది.

ఇంతకాలం తనకలాంటి ఆలోచన రానందుకు లోలోపల తిట్టుకున్నాడు. పైకిమాత్రం “మీరు గొప్పగా ఆలోచించారు. మీ ఆలోచనకు తిరుగేముంది బడేమియాగారూ?” అన్నాడు.

బడేమియా తలూపాడు. పళ్లు పటపట నూరి “మాదీ ఛోటాసాబ్‌ను వాడు చంపినదు, దీన్కి ప్రతీకారం చేసీ తీరాల. వాడి జొన్నచేన్, కందిచేన్, పెస్రాచేన్ కోయించి కైలు చేయిపించుతాం. ఎపట్కయినా వాణ్ణి వెత్కి పట్కుని గోరీ కట్టిపిస్తాం” అన్నాడు.

ఆ మాటలనందరూ సమర్థించారు. కానీ కాసేపటికి ఛోటామియాను చంపినది ఎవరనే విషయం మీమాంసకు వచ్చింది. బడేమియా మాత్రం “కోదండరాంరెడ్డి చంపినదు” అన్నాడు గట్టిగా.

“నమ్మదగని మాట బడేమియాగారూ, వాడు ముసలి లంజాకొడుకు. అందులోనూ మిలట్రీ దెబ్బలకు అతడి కీళ్లన్నీ విరిగిపోయి ఎటూ కదలలేని స్థితిలో పడితేనే కదా మనం వాడ్ని చెరువువద్దనే వదిలేసి వచ్చింది? అతడంతలోనే లేచివచ్చి చోటామియాగారిలాంటి ఆజానుబాహుని పై కలబడి చంపివేశాడంటారా?” అన్నాడు పటేలు.

“వాడూ చంప్కాపోతే ఎవరు చంపారు?” అడిగాడు బడేమియా.

“ఆ ఇంట్లో ఆడవాళ్లె చంపి ఉంటారని నా నమ్మకం” అన్నాడు పటేలు. మధ్యలో హవల్దారు కలిగించుకుని “నైనై పటేల్ జీ, మేం మీ మాటల్ని నమ్మకం చెయ్యం. ఆడ మనుషుల్కు అంత ధైర్యం ఉండదు” అన్నాడు.

“ఆడ మనుషుల్ చంపలేదు. కోదండరాంరెడ్డి చంపలేదు. మరి ఎవరు చంపి ఉంటరు?” అనడిగాడు బడేమియా.

“ప్రతాప్‌రెడ్డి చంపి ఉంటడు” అన్నాడు హవల్దారు.

“నిజమే, ప్రతాప్‌రెడ్డి వల్ల జరిగిఉంటుంది” అన్నాడు పటేలు.

“అరె, ఇంకా ప్రతాప్‌రెడ్డి ఎక్డా ఉన్నాదయా? ప్రతాప్‌రెడ్డి, పూరా సంగం అంతా అడ్వుల్ పట్టి పోయినరుగదా?” అన్నాడు బడేమియా.

“ప్రతాప్‌రెడ్డి ఈ ఛాయలనే ఉండిఉంటాడని నా నమ్మకం” అన్నాడు పటేలు.

“సచ్చీబాత్‌హై” అన్నాడు హవల్దారు.

అంతలోనే హుసేను సాహెబు కలిగించుకుఅన్నడు.

“ప్రతాప్‌రెడ్డి ఈ ఛాయలనే తిరుగుతున్న మాట నిజం. గద్చిపోయ్నిరాత్రి మేం గేమంలో నిగ్రాణీ చేస్తుంటే కోదండరాంరెడ్డి ఇంటిదగ్గర్కీ వచ్చేసర్కి మన్ని కదిలీనట్లు అన్పించింది. లైట్లు ఏసీ సూశాక ఇద్దర్ మనుషుల్ పాదూపడ్ని గోడల్ లోపల్కి ఎల్లిపోతూండటం కన్పించింది” అన్నాడు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛోటా

పున్నాగపూలు

తంగెళ్ళపల్లి కనకాచారి

క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజ్ ఎంట్రెన్స్‌లో చెట్టుకింద గుంపుగా ఎనిమిదిమంది విద్యార్థులు నిల్చుని ఉన్నారు.

అంతలో జీవన్ హీరోహోండాపై వేగంగా వీరివైపు వస్తూ కనిపించాడు. తను కూర్చున్న సీట్‌మీద లావుపాటి రెండు పెద్ద పుస్తకాలు ఉన్నాయి. వీరివైపు వస్తున్నట్లు వచ్చి ఐసిఎస్ఎస్ఆర్ లైబ్రరీవైపు దూసుకుపోయాడు.

అక్కడ గుంపులో నుండి ఓ విద్యార్థి "అరే జీవన్ ఎంట్రా... ఆగు" అని కేకేశాడు.

మిగతా విద్యార్థులంతా "ఏయ్... జీవన్ రావాలి" అంటూ గోలగోలగా అరవడం మొదలెట్టారు.

లాభం లేదనుకొని జీవన్ తన హోండాని రివర్స్ చేసి, చెట్టు కిందికొచ్చాడు.

"ఏంట్రా గొడవ? నన్ను కాస్త చదువుకోనిస్తారా?" అభ్యర్థిస్తున్నట్లుగా అన్నాడు జీవన్.

"ఏరా... ఇలా హఠాత్తుగా మంచి బాలుడవైపోయావు?"

"నేనెప్పుడూ ఇంతే... మారిపోయిందేంటి?"

"నిజం చెప్పరా. నాలుగైదు నెలలుగా ఎప్పుడైనా లైబ్రరీ ముఖం చూశావురా?" రెట్టించాడు మరో మిత్రుడు.

"నేను వెళ్లేది చూశావురా హృదయ్? లైబ్రరీకి వెళ్ళడం నాకలవాటే"

"కహానీ చెప్పకమ్మా. మొన్నీమధ్య దసరాకని ఊరెళ్లావు. ఇప్పుడు ప్రత్యక్షమయ్యావు" వెటకారంగా అన్నాడు హృదయ్.

"ఊరెళ్ళాక అక్కడ వీడిని ఎవరో మార్చేశార్రా..." అన్నాడొక మిత్రుడు నవ్వుతూ.

అందరూ "హే...హే..." అంటూ గోలగోలగా చప్పట్లు చరుస్తూ కేకలేస్తున్నారు.

అంతలో దీపిక, హరిత అటుగా వెళ్తూ వీళ్ల గోల విని వీరివైపు కదిలారు.

"హాయ్ ఫ్రెండ్స్... హౌఆర్ యూ" అంటూ అందరికీ విష్ చేసింది దీపిక.

హరిత కూడా పలకరింపుగా నవ్వింది.

అందరూ తిరిగి విష్‌చేసి దీపిక, హరితలకు షేక్ హ్యాండ్ ఇచ్చారు.

"జీవన్... నీ చేతిలో బుక్సేంటి?" ఆశ్చర్యంగా అడిగింది దీపిక.

"అదే కదా, మా గొడవ" అంటూ అసలు విషయం చెప్పాడు హృదయ్.

"ఏంటి విచిత్రంగా మాట్లాడతారు? నా చేతిలో బుక్స్ చూసి తెగ ఇదైపోతున్నారేంటి?" చిరాగ్గా ముఖం పెట్టి అన్నాడు జీవన్.

"ఎప్పుడూ ధర్నాలు, బందులంటూ తిరిగే నువ్వేనా ఇలా మాట్లాడేది? అసలు నువ్వు జీవన్‌వేనా?!" అంది హరిత.

''గిచ్చి చూద్దామా?'' అన్నాడు హృదయ్ నవ్వుతూ. అందరూ మరోసారి నవ్వుకున్నారు.

"అసలు కథేంటి బాబూ?" అందుకున్నాడు మరో విద్యార్థి.

జీవన్ జరిగిన విషయం చెప్పక తప్పలేదు.

"దసరాకని ఇంటికెళ్లానా... అసలు ఇల్లు కదిలి వెళ్లొద్దని అనుకున్నాను. కానీ అమెరికాలో చదువుతున్నాడని చెప్పానే ప్రేమ్... వాడు మా ఇంటికొచ్చి బైటికి తీసికెళ్లాడు"

"తర్వాత?" కుతూహలంగా అడిగింది దీపిక.

"మేం చదువుకున్న మా గవర్నమెంట్ స్కూల్ దగ్గరికెళ్లాం. దార్లో మా పాతమిత్రులు సాగర్, జనార్దన్, గోపి, అజయ్... వీరంతా కలిశారు. మేం స్కూల్లో ఎప్పుడూ కూర్చునే గ్రౌండ్‌లోని పున్నాగపూల చెట్టు కింద కూర్చున్నాం"

"టెన్షన్ పెట్టకురా... త్వరగా చెప్పు" మధ్యలో అందుకున్నాడు హృదయ్.

"ప్రేమ్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సెటిల్ అయ్యాడు. సాగర్ బెంగుళూరులో గవర్నమెంట్ జాబ్. జనార్దన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. గోపీనేమో ఊళ్లో తన పది ఎకరాల పొలం చూసుకుంటున్నాడు. టీవీ షోరూం పెట్టాడు. అందరూ జీవితంలో పూర్తిగా సెటిలైపోయి, పరుగులు తీస్తున్నారు. తెగ డబ్బు సంపాదించేస్తున్నారు. హ్యాపీగా ఉన్నారు. ఇంటికి వచ్చిన బంధువులతో, పరిచయస్తులతో మా అమ్మానాన్నా నేను సిటీలో పి. హెచ్.డి చేస్తున్నానని, తెగ సంబరపడిపోతూ చెప్తున్నారు. ఊళ్లో అంతా నన్ను గౌరవంగా పెద్ద చదువులు చదువుకున్నవాడని గొప్పగా మాట్లాడేస్తున్నారు. లాభం లేదు. నేనూ బాగా చదువుకొని పిహెచ్.డి పూర్తి చేయాలిరా. అందరూ నాపై పెట్టుకున్న కలల్ని నిజం చెయ్యాలి. నా బాల్య స్నేహితులంతా పిహెచ్‌డి పూర్తికాగానే తమవద్దకు రమ్మంటున్నారు. ఏవేవో జాబ్ ఆపర్చ్యునిటీస్ వున్నాయని చెప్తున్నారు" ఉద్వేగంగా చెప్పాడు జీవన్.

"అదన్నమాట కథ. మరి మా ఉద్యమాలకు నాయకుడు ఎలా?" ఓ విద్యార్థి గట్టిగా నవ్వుతూ ప్రశ్నించాడు.

"పోరాటాలు పోరాటాలే... సీరియస్‌గా బతుకు గూర్చి కూడా ఆలోచించాలి, తప్పదు" అన్నాడు జీవన్.

"పున్నాగపూలలా... వీడు రివర్స్‌గా పూచేస్తున్నాడురా" అన్నాడు హృదయ్.

"రివర్స్ కాదు. ఇప్పటికైనా మన దారికొచ్చాడు. అందుకు సంతోషిద్దాం. మొన్న ధర్నాలో పోలీసుల చేతిలో ఎలా దెబ్బలు తిన్నాడు. బెడ్‌మీంచి వారంరోజులు కదల్లేదు. మనమంతా జీవన్ గూర్చి ఎలా బాధపడ్డాం? నిజమే... జీవన్ మంచిగా ఉండాలి. అదేగా మనక్కావల్సింది" అంది దీపిక.

"చాలా థాంక్స్. నన్ను అర్థం చేసుకున్నారు" అంటూ వేగంగా లైబ్రరీ వైపు దూసుకెళ్లాడు జీవన్.

✤

చందు

తెలీకుండానే తెలుగుమీద ఆసక్తి కలిగింది

వారి కలానికి పదునెక్కువ. అందుకే వారి రాతలకు ప్రేక్షకులు తమ హర్షధ్వానాలతో అగ్రతాంబూలం ఇస్తున్నారు. నవరసభరితమైన సంభాషణలు వారి కలంలో తొణికిసలాడుతుంటాయి. సామాజిక చైతన్యాన్ని తెచ్చే సన్నివేశాలను సృష్టించి అభ్యుదయభావాలను గుప్పించే ప్రయత్నం చేస్తుంటారు. అందుకే వారికి 'విప్లవ రచయితలు' అని పేరు. వారే 'పరుచూరి బ్రదర్స్'. వారిద్దరిలో చిన్నవాడైన పరుచూరి గోపాలకృష్ణ రచనాపటిమలో మాత్రం గట్టివాడు. ఆయన చెప్తోన్న కబుర్లు.

మా పూర్వీకులది బేతపూడి. మా నాన్నగారికి ఆరు సంవత్సరాల వయసుండగా కృష్ణాజిల్లాలో ఉన్న మేడూరు గ్రామానికి వలస వచ్చారు. నా బాల్యం (13 సంవత్సరాల వరకు) అక్కడే గడిచింది. 1959లో నూజివీడు వెళ్ళి 18వ ఏట వరకూ అక్కడే ఉన్నాం. 1964లో కుటుంబం యావత్తూ హైదరాబాద్ వచ్చాం. సిటీ సైన్స్ కాలేజీలో బి.యస్.సి, ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ(తెలుగు) చదివాను. 11 సంవత్సరాలపాటు తెలుగు లెక్చరర్‌గా, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా, పని చేశాను.

బి.యస్.సి చదువుతున్న రోజుల్లో సాహిత్య అకాడమీవారు ప్రాచీన గ్రంథాలు ప్రచురించేవారు. అన్నయ్య చాలా ప్రబంధాలు కొన్నాడు. దీని వెల రూపాయి. వాటిని చదువుతున్నప్పుడు పద్యాలు అర్థమయ్యేవికావు. కానీ ఆ పీఠికలు చదివేకొద్దీ తెలీకుండానే తెలుగుమీద ఆసక్తి కలిగింది. బి.యస్.సి రెండో సంవత్సరం తెలుగులో 71 మార్కులొచ్చాయి. డిగ్రీ పూర్తవ్వగానే ఎం.ఏ తెలుగుకి అప్లయ్ చేస్తే దివాకర్ల వెంకటావధానిగారు 'ఇతనెవరో బి.యస్.సి కుర్రాడు తెలుగులో 71 మార్కులు తెచ్చుకున్నాడు. ఇతనికి తెలుగంటే ఇష్టమున్నట్లుంది. ముందు సీటు ఇతనికే ఇద్దాం' అన్నారట. నేను బి.యస్.సి స్టూడెంట్‌ని కదా! ఏ సెకెండ్ లిస్టులోనో, థర్డ్ లిస్టులోనో సీటొస్తుందిలే అనుకుని ఫస్ట్ లిస్ట్ చూసుకోలేదు. సెకెండ్ లిస్టులో నా పేరు లేదు. ఇక చేసేదేమీ లేదు, ఎక్కడికన్నా వెళ్ళి ఎం.ఎస్.సి కెమిస్ట్రీయో, బాటనీయో, జువాలజీయో చదువుకోవాలనుకుంటున్న సమయంలో అశోక్ కుమార్ (అగ్రికల్చరల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గారి అబ్బాయి, నా క్లాస్‌మేట్) ఫోన్ చేసి 'ఏరా... గోపాలా, ఎం.ఏ తెలుగులో చేరలేదేంటిరా' అంటే 'నాకెక్కడ సీటొచ్చిందిరా' అన్నాను. 'ఫస్ట్ లిస్టులో ఫస్ట్ పేరే నీదిరా' అన్నారు. సెకెండ్ లిస్టు పెట్టిన సమయంలో వెళ్ళి చూస్తే, ఫస్ట్ లిస్ట్ ఎక్కడా కనబడలేదే అంటే 'ఊడిపోయి నోటీసు బోర్డులో కింద పడుంది' అన్నాడు. వెళ్ళి చూస్తే నిజంగానే అక్కడే పడుంది. సీటుగురించి అడిగితే, 'ఫస్ట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులను జాయిన్ చేసుకోవడం ఐపోయింది' అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ వెల్లంకి వెంకట సుబ్బారావుగారు, మా అన్నయ్య దివాకర్ల వెంకటావధానిగారి దగ్గరికి తీసికెళ్ళారు. 'ఈ కుర్రాడు ఎవరో బి.యస్.సి చదివి తెలుగులో 71 మార్కులు తెచ్చుకున్నాడు కదా అని ఫస్ట్ లిస్టులో సీటిచ్చాం. ఇతను చేరలేదేంటబ్బా అని భలే బాధేసిందండి' అని వెంకటావధానిగారు సుబ్బారావుగారితో అన్నారు. వెంకటావధాని గారే స్వయంగా నన్ను ప్రిన్సిపాల్‌గారి దగ్గరికి తీసుకెళ్ళి ఆయనతో కూడా ఇదే కారణం చెప్పి 'ఒక సైన్స్ విద్యార్థి తెలుగుమీద ప్రేమ చూపిస్తున్నాడు. అతనేమో నేను సైన్స్ విద్యార్థిని కాబట్టి మొదటి లిస్టులో రాదని అనుకున్నాడట. సెకెండ్ లిస్టు చూసుకోవడానికి వచ్చే సమయానికి మొదటిది కింద పడిపోయి ఉంది. అది అతికించి ఉంటే చూసుకుని ముందే జాయిన్ అయ్యేవాడు. ఇందులో పొరబాటు మనది కూడా ఉంది' అని చెప్పి సీటిప్పించారు. జూన్‌లో లిస్టులు పెడితే సెప్టెంబర్ నెలాఖరులో ఎం.ఏ.లో చేరాను.

'వివాహే విద్యా నాశనం' అన్నట్లు...

ఎం.ఏ మొదటి సంవత్సరంలో ఫస్ట్ వచ్చాను. రెండో సంవత్సరం వచ్చేసరికి పెళ్ళయింది. 'వివాహే విద్యా నాశనం' అన్నట్లు మరీ నాశనం అయిపోకుండా ఐదో స్థానానికి వచ్చాను. ఎం.ఏ పూర్తవ్వడం, జాబ్ రావడం వెంటనే జరిగిపోయాయి. జాబ్ రావడానికి ముందు ఆల్ ఇండియా రేడియోలో కూడా సెలక్ట్ అయ్యాను. నా గొంతును ఆడిషన్ టెస్ట్ చేసి తీసుకోవాలనుకుని ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇమ్మన్నారు. ఆలిండియా రేడియోలో పనిచేస్తున్నతను(పేరు గుర్తుకురావడం లేదు) 'మీరు ఎం.ఏ చదివారా! మరి మమ్మల్నెందుకు ఇబ్బంది పెడతారు. మీరెక్కడికి వెళ్ళినా లెక్చరర్‌గా తీసుకుంటారు. కొంతకాలం ఇక్కడచేసి వెళ్ళిపోతే మళ్ళీ మేం ఇంటర్వ్యూలు కండక్ట్ చేసుకోవాలి. ఆలోచించుకోండి' అన్నారు. ఆయనన్న మాటలను ఆలోచించి వద్దులే... అని సర్టిఫికెట్స్ వెనక్కి తీసేసుకున్నాను. భీమవరం సమీపాన ఉన్న చిననింద్రకొలను(పత్తేపురం)లో చింతలపాటి మూర్తిరాజుగారి కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా జాయిన్ అయి 1971 నుంచి 1975 వరకు పనిచేశాను. అమ్మానాన్నా పెద్దవాళ్ళైపోయారు. పెద్దన్నయ్య, అక్కయ్య హైదరాబాద్‌లో, చిన్నన్నయ్య విజయవాడలో ఉన్నారు. అమ్మానాన్నల దగ్గర ఎవరూ లేరు. మేడూరుకు ఉయ్యూరు తొమ్మిది మైళ్ళ దూరం. ఉయ్యూరు కాలేజీలో చేరితే తల్లిదండ్రుల దగ్గరే ఉండొచ్చనుకున్నాను. నాన్నగారు నూజివీడులో ఉన్నప్పుడు ఉయ్యూరు కాలేజీ ప్రెసిడెంట్ అడుసుమిల్లి విశ్వేశ్వరరావుగారి పొలంలో(కంద్రికతోట) సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఉండేవాళ్ళు. ఆయన సిఫార్సుతో జాబ్ వచ్చింది. దీంతో తొలి ఉద్యోగానికి రాజీనామా చేశాను. మూర్తిరాజుగారు పిలిపించి 'నువ్వు చాలా మంచి లెక్చరర్‌వి. నిన్ను కావాలని సెలెక్ట్ చేసుకున్నాను. ఇక్కడ మేమిస్తున్న 760 రూపాయలు వదిలిపెట్టి 530 రూపాయలకు అక్కడికెందుకు వెళ్తున్నారు?' అనడిగారు. తల్లిదండ్రులకు చేదోడుగా ఉందామన్న ఉద్దేశంతో వెళ్తున్నానంటే సరే అన్నారు.

ఇంటర్వ్యూలో ఒక విచిత్రం జరిగింది. అడుసుమిల్లి విశ్వేశ్వరరావుగారి సిఫార్సుతో వస్తున్నాను కాబట్టి నేను సెలెక్ట్ అవ్వకూడదన్న సంకల్పంతో కొంతమంది ఉన్నారు. ఇంటర్వ్యూ సమయంలో వెయ్యాల్సిన ప్రశ్నలన్నీ వేసి నేను ఎక్కడ చెప్పకపోతే బయటికి పంపించేద్దామా అన్నట్లు ఉన్నారు. కానీ పత్తేపురంలో ఉన్నటువంటి సంస్కృత ఉపాధ్యాయులందరికీ (లక్ష్మణ మూర్తి శర్మ, ఇంకా కొందరి పేర్లు గుర్తుకురావడం లేదు) నేను జీవితాంతం రుణపడి ఉన్నాను. నేను ఎం.ఏలో నేర్చుకున్న దానికంటే లెక్చరర్‌గా ఐదు సంవత్సరాలపాటు పత్తేపురంలో ఉన్నప్పుడు వాళ్ళ దగ్గర అద్భుతమైన పాండిత్యం నేర్చుకున్నాను. 29 ప్రబంధాలు వాళ్ళ దగ్గర చదువుకున్నాను. 'ఏంటయ్యా నువ్వు స్టూడెంట్‌లాగా నేర్చుకుంటున్నావ్...' అని వారనేవారు. మాస్టారు నిత్య విద్యార్థి కదా! వాళ్ళు నేర్పిన విద్య ఉయ్యూరు ఇంటర్వ్యూలో ఉపయోగపడింది. ఏదడిగినా చెప్పుకుంటూపోవడంతో అప్పటి డి.ఇ.ఓగారు ఓ ప్రశ్న వేశారు. మనుచరిత్రలో 'అటచనిగాంచె...' పద్యం చెప్పి దాని సారాంశం చెప్పమన్నారు. ఇంటర్వ్యూల్లో ఇలా పద్యాలడిగితే ఎలా చెబుతాం? నేను ఆ మహానుభావుల దగ్గర చదువుకున్నాను కాబట్టి పద్యాన్ని అప్పజెప్పేసి సారాంశం చెప్పేశాను. 'మీరు అసలు సారాంశం చెప్పలేదు' అన్నారు.

(ఇంకా వుంది)

ఆ ఒంటె ఏదబ్బా...





చిన్నారులూ...! ఇక్కడ పది ఒంటెలున్నాయికదా. అందులో ఒకటి ఈ షేక్‌ది. కాకపోతే తన ఒంటె ఏదో కనుక్కోవడం కష్టమైంది ఆయనకు. ఆయన ఒంటె టోపీ పెట్టుకుంది. ఇంకా మెడలో గొలుసు వేసుకుంది. అంతేకాదు! ముక్కుకు రింగు కూడా వుంది. అదేదో కనుక్కోండి చూద్దాం.

పూలగుత్తి పట్టుకుంది ఎవరు?



చివరకు మిగిలేది ఏది?



ఫ్రెండ్స్! పైన కొన్ని జంతువులు, వస్తువులు వున్నాయి కదా. మీరు వాటిని జతచేయాలన్నమాట. అలా జతచేయగా ఒక్క జంతువు మిగిలిపోతుంది. అదేదో మీరు గుర్తించాలి. మరి ఆలస్యం ఎందుకంట!



15 తేడాలు కనుక్కోగలరా చూ

గూడు చేరాలంటే!



రంగులేసేద్దాం

ఆ ఆంగ్ల సామెత ఏంటి?



A				
R	O	E	R	S
L	L	H	O	N
I	N	T	M	O
S	G	A	G	S
T	O	N	E	S

హాయ్ చిన్నారులూ...!

పై అక్షరాల్లో

ఓ ప్రసిద్ధ ఆంగ్ల సామెత దాగివుంది. దాన్ని

మీరు కనిపెట్టాలి. కాకపోతే ఒక్కో అక్షరాన్ని ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలి.

కోడిపిల్లలు ఎన్నో...



ఆ ఒంటె ఏదబ్బా!

షేక్ ఒంటె ఏడవది.

చివరకు మిగిలేది ఏది?

జత చేస్తే: గుర్రం - నాడా, ఒంటె- ఎడారి, కోడి - గుడ్డు, చేప - గేలం, కుందేలు - క్యారెట్, గొంగళి పురుగు - ఆకు, గొర్రె - ఊలు. చివరికి మిగిలింది కంగారూ.

కోడిపిల్లలు ఎన్నో....! 34

ఆ ఆంగ్ల సామెత ఏంటి?

A rolling stone gathers no moss.

15 తేడాలు కనుక్కోండోచ్!



అట్టమీది కథ

డా|| కాకర్లమూడి విజయ్

మూడువారాల్లో నల్లగా, 'అందవికారంగా' ఉన్న అమ్మాయి తెల్లగా మారిపోతుంది. ఆ అమ్మాయికి పెళ్లి సంబంధం కుదురుతుంది. నున్నగా గడ్డం గీసుకున్న అబ్బాయికే అమ్మాయిలు ఆకర్షింపబడతారు. తెల్లని పళ్ళు కనిపించేలా నవ్వితే గాళ్స్‌కి బాయ్‌ఫ్రెండ్స్ దొరుకుతారు. చెమట వాసనను తరిమే సెంటు పూసుకుంటే బాయ్స్ ఫ్రెండ్సవుతారు. నూనెలు రాస్తేజుట్టు విపరీతంగా పెరుగుతుంది. షాంపులు వాడితే పట్టులాగానూ గట్టిగానూ అవుతుంది.

కాటేసే కాస్మెటిక్స్

సౌందర్యసాధనాల ప్రపంచంలోకి స్వాగతం. అందమంటే చర్మపు మందమంతే అనుకునేవాళ్లని అనుకోనివ్వండి. అందం చూసే చూపులోనే ఉంది అని నమ్మేవాళ్లని నమ్మనివ్వండి. ఉన్నదానికంటే మెరుగ్గా (అందం?) తయారవ్వాలన్న ఆశ, ఆరాటం ఉన్నవాళ్లు మాత్రం ఎవరినీ పట్టించుకోరు. వీళ్లే అత్యధిక సంఖ్యాకులు!

కాస్మెటిక్స్ వల్ల నష్టాలున్నాయని మీడియా హోరెత్తుతున్నా, క్యాన్సర్ వంటి తీవ్ర పరిణామాలుంటాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నా వాటి వాడకంవల్ల శరీరంలో ప్రతిచర్యలు జరుగుతాయని ఋజువులు చూపిస్తున్నా సరే... ఆకర్షణీయంగా, అందంగా తయారవ్వాలన్న ప్రయత్నాలకు మాత్రం అడ్డు లేకుండా ఉంది.

'కాస్మెటిక్స్ వాడితే తప్పేముంది? ఈ రోజుల్లో ఆకర్షణీయంగా కనిపించాలనుకోవడం చాలా సహజం' అంటోంది డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న రజని. నెలకు కనీసం నాలుగుసార్లు బ్యూటీ పార్లర్‌కి వెళ్లి రకరకాల బ్యూటీ ట్రీట్‌మెంట్లు తీసుకుంటుందామె. ఇక మిగతా రోజుల్లోనూ రకరకాల క్రీములో, పేస్టులో, ప్యాక్‌లో తప్పనిసరి అంటుంది.

కాస్మెటిక్స్‌లో హానికర రసాయనాలుంటాయన్నది వాస్తవం. కానీ అటువంటి అవగాహన వాటిని నిత్యం వాడేవారిలో లేదన్నదీ వాస్తవమే. 'మనం రోజూ పీల్చే గాలి, తాగేనీరు, తినే ఆహారంలోనూ హానికర పదార్థాలున్నాయి. అయితే పెద్ద ఇబ్బందులేమీ లేవుకదా. ఒకవేళ కాస్మెటిక్స్‌లో ఉన్నా, మేం వాడేది తక్కువ కాబట్టి వాటితో సమస్యలూ తక్కువే కావచ్చు' అనేది స్వాతి అభిప్రాయం. 'అయినా నేను ఇంటర్నేషనల్ బ్రాండులనే వాడతాను' అని వెంటనే జోడించింది.

విదేశీ సౌందర్య సాధనాలలో హానికర పదార్థాలు తక్కువ అన్న దురభిప్రాయం అంతటా ఉంది. అత్యంత ఎక్కువగా అమ్ముడుపోయే 'ఫెయిర్ & లవ్లీ' క్రీమ్ దిగువ మధ్యతరగతివారిలో బాగా ఆదరణ పొందింది. 'పై' స్థాయివాళ్లు దానివంక కూడా చూడరు. విశేషమేమిటంటే 'ఫెయిర్ & లవ్లీ' భారతదేశంలో తొలిసారి ప్రవేశపెట్టబడిన (1976) 'తెల్లబరిచే క్రీమ్' ఈనాడు అది 30 దేశాలలో అమ్ముడవుతోంది! 'తెల్లబరిచే' సాధనాలలో ఉండే హానికర పదార్థాలు ఏ దేశంలో అయినా ఒకటే!

క్రీస్తు పూర్వం 4000 సంవత్సరాల నుండే ఈజిప్టులో సౌందర్యసాధనాల వాడకం ఉన్నట్లు పురావస్తు శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. ఆ తరువాత సౌందర్యసాధనాల చరిత్రను చాలామంది తవ్వి తీసినా, వాటి ఉపయోగం మాత్రం 20వ శతాబ్దంలో మంచి ఊపందుకుంది. సాధారణమైన కొబ్బరినూనె నుండి శరీరం పైనుండి వెంట్రుకలను నొప్పిలేకుండా తీసేసే క్రీముల వరకూ వందలాది కాస్మెటిక్స్ అవతరించాయి.

నలుగుపిండి, పసుపు, కాటుక, గంధం, నిమ్మకాయ వంటి సాంప్రదాయ పదార్థాలనే కాస్మెటిక్స్‌గా వాడే రోజులు పోయాయి. 'అద్భుతమైన' రూపాంతరాలు 'తక్షణం' సాధ్యం అనే వాగ్దానాలతో ఉత్పత్తులు వస్తుంటే పాత పద్ధతులను ఎందుకు పాటిస్తారు? 'ఇప్పుడొస్తున్న ఆధునిక ఉత్పత్తులలోనూ, హెర్బల్ అంశాలున్నాయి కదా. కాబట్టి మనం మళ్లీ శ్రమించవలసిన పనేముందని అడిగిందిరజని. సులభమైన మార్గాలుండగా గంధం అరగదీసుకొని పెట్టుకోవలసిన పనిలేదు. నిజమేకానీ గమనించవలసిన విషయం ఒకటోంది. హెర్బల్ ఉత్పత్తులలో మూలికలు నేతి బీరకాయలో నేయి వంటివేనా? ఉత్పత్తి మొత్తంలో 1% హెర్బల్ ఉన్నా ఆ ఉత్పత్తిని హెర్బల్ అనే అనేందుకు చట్టపరమైన వీలుంది. పైగా ప్రకృతి సహజమైన పదార్థాలని వేరుచేసి, దీర్ఘకాలంపాటు నిలువ ఉంచడానికి రసాయనాల వాడకం తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో హెర్బల్ ఉత్పాదన అసలు ఎటువంటి ప్రభావాన్నైనా ఎంత మేరకు చూపిస్తుందో చెప్పలేమంటున్నారు నిపుణులు.

'మనుషులంతా ఒకటే' అనే భావన బాగున్నా వాస్తవానికి మనుషుల చర్మం చాలా భిన్నంగా ఉంటోంది. ప్రతి సౌందర్య సాధనం అందరికీ ఒకేలా ఫలితాన్నిస్తుందన్న గ్యారంటీ లేదు. పైపెచ్చు కొందరి చర్మతత్వాన్ని

అన్నిటికీ 'అదే' అలోవెరా!

హెర్బల్ ఉత్పత్తులు అంటూ చాలా కంపెనీలు చర్మ సౌందర్యంకోసమే తయారుచేస్తున్నా మొటిమల నుండి మోకాళ్ల నొప్పుల వరకూ, హెయిర్ కేర్ నుండి హెచ్ ఐ వి వరకూ ఒకటే మంత్రంలా ప్రచారం చేయబడుతోంది మన కలబంద. క్రీస్తు పూర్వం నుండీ దీన్ని ప్రపంచ సుందరీమణులు వాడి లాభం పొందారని ఊదరగొడ్తూ గత కొద్దికాలం నుండి 'అలోవెరా' ఉత్పత్తులు మార్కెటును ముంచేశాయి. ప్రారంభంలో విదేశీ కంపెనీలొచ్చినా ప్రస్తుతం స్థానికంగానే అనేక పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. అలోవెరాని ఎన్నో రకాల రుగ్మతలకు పరిష్కారంగా చూపిస్తున్నా, అది చర్మ సౌందర్య సాధనంగా బాగా ప్రసిద్ధి. ఇప్పుడు సబ్బులలో, అనేక క్రీములలో, చివరికి టాల్కం పౌడర్లలో కూడా అలోవెరా ఉందన్న ప్రకటనలతో సొమ్ము చేసుకుంటున్నారు.



బట్టి దుష్ప్రభావాలూ కనిపిస్తాయి. బ్లీచింగ్ పదార్థాలు, అమోనియా ఉండే హెయిర్‌డైలు కచ్చితంగా విపరీత ప్రభావాలు చూపుతాయి. ఐలైనర్లు, మస్కరాలు కంటిపై ప్రభావం చూపుతాయి. ఇంకొంతమంది చర్మపు నునుపుదనం, నిగారింపుల కోసం వాడే ప్రోసీజర్లు అన్నిసార్లూ అనుకున్న ఫలితాలనివ్వకపోవచ్చు. అలాగే లేజర్లు, యాసిడ్లు వంటివి కూడా దుష్ప్రభావం కలిగించే ప్రమాదం లేకపోలేదు.

కాస్మెటిక్స్ దుష్ప్రభావాలు అలాంటివైతే ఇక సత్ఫలితాలెలా ఉంటాయి? 'నేను నా చిన్నప్పటి నుండి ఈ క్రీము వాడుతూనే ఉన్నా. కానీ చర్మం ఏమాత్రం తెల్లబడలేదు' అని వాపోయింది శ్రీమతి లక్ష్మి. 'ఒకటి రెండు ఖరీదైన బ్రాండులు వాడినా ఫలితం లేదు' అందామె. 'అది కరెక్టే. కాస్మెటిక్స్ వల్లనే అనుకున్న అందం రావడం సులభం కాదు' అంటున్నారు డాక్టర్ విజయ్. 'విటమిన్లు, ప్రొటీన్లు చర్మం పైనుండి, వెంట్రుకల ద్వారానో లోపలికి పోవు. కాబట్టి సబ్బులు, క్రీములు, షాంపూలు, లోషన్లలో విటమిన్లు, ప్రొటీన్లు ఉంటే ఉండవచ్చు గానీ అవి పైపైనే పనిచేస్తాయి. శరీరంలోపలికి వెళ్ళే ప్రసక్తేలేదు. విచిత్రమేమిటంటే కాస్మెటిక్స్ ఇచ్చే సత్ఫలితాలు చాలా తాత్కాలికమైనవి, స్వల్పకాలికమైనవి. కానీ వాటివల్ల వచ్చే దుష్ఫలితాలు మాత్రం దీర్ఘకాలం ఉంటాయి!' అంటారు విజయ్.

కానీ ఇవన్నీ పట్టించుకునేందుకు ప్రజలు సిద్ధంగాలేరు. పేదలు, ధనికులు, పిల్లలు, పెద్దలు, ఆడ, మగ ఒకరేమిటి... ఈనాడు అందరూ కాస్మెటిక్స్ జాలంలో చిక్కుకున్నవాళ్లే. కాకపోతే ఎంత మోతాదు అనేదే భేదం. సబ్బువాడనివారూ, తలనూనె వాడనివారు ఎవరూ లేరు. ఇక ఫ్యాషన్‌షోలూ, ప్రపంచ సుందరుల పోటీలూ, విదేశీ ప్రచార మాధ్యమ ప్రభంజనాలూ కలిసి కాస్మెటిక్స్ వినియోగాన్ని విపరీతంగా పెంచేశాయి. ఎదుటి వారికి ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తే అంత మంచిదన్న అభిప్రాయం అంతటా ఉంది. 'కాస్త అందంగా, ఆకర్షణీయంగా కనిపించేవారికి కచ్చితంగా లాభమే' అంటోంది లావణ్య. 'మంచి రంగు (తెలుపు) ఉన్నవాళ్లు కాస్త తక్కువ రంగు ఉన్నవాళ్ళలో గుర్తింపు పొందుతారు. వారికి ఉద్యోగావకాశాలూ, పెళ్ళి అవకాశాలూ, చివరికి బాయ్‌ఫ్రెండ్స్ 'దొరికే' అవకాశాలూ ఎక్కువని సమాచారం. దీనికి తోడు నల్లని చర్మం అందవిహీనమనీ, సామాజికంగా ఆమోదయోగ్యం కానిదనీ అర్థం వచ్చేటట్టు తీస్తోన్న ఎడ్వర్టైజ్‌మెంట్లు ఆ ఆలోచనని మరింత జటిలం చేస్తున్నాయి. అందువల్లే కాస్మెటిక్స్ వినియోగం పెరిగిందన్న వాదన కూడా ఉంది. అందరికీ కాస్మెటిక్స్ ఒకేలా పనిచెయ్యవన్న వాస్తవాన్ని తమకు లాభకరంగా వ్యాపారస్తులు వాడుకుంటున్నారు. అందుకు నిదర్శనం ఈమధ్యనే వచ్చిన తెల్లబరిచే క్రీములు. కొత్తగా పురుషులకు ఒకటి, మధ్యవయసు స్త్రీలకు

హెర్బల్ తుపాను

గత రెండు సంవత్సరాలలో హెర్బల్ భావన చర్మసౌందర్య ఉత్పత్తులలో తుపాను రేపింది. ఇప్పుడు 300 కోట్లతో ఉన్న ఈ రంగం బహు ఆశాజనకమైన వ్యాపారం. షెహనాజ్ హుసేన్, బొటీక్, లోటస్ వంటి ప్రీమియం బ్రాండులతో పాటు ఇప్పుడు హిందూస్తాన్ లీవర్, ఇమామి తదితరులు కూడా హెర్బల్ ప్రొడక్టులను ప్రవేశపెడుతున్నారు. హానికర రసాయనాలు వుండవన్న 'నమ్మకం' ఈ హెర్బల్ వ్యాపారాన్ని దినదినాభివృద్ధి చేస్తోంది. ఈ ధోరణి ఇప్పటివరకూ ఔషధాలు చేసుకునే సంస్థలపై బాగా ప్రభావం చూపింది. డాబర్, హిమాలయా డ్రగ్స్, డా॥ మోరిపాన్ వంటి పెద్ద మందుల సంస్థలు కాస్మెటిక్స్‌లోకి దిగాయి. హిమాలయా డ్రగ్స్ తన ఆయుర్వేదిక్ కాన్సెప్ట్‌తో ఇప్పటికే మార్కెట్‌లో ఉంటే డాబర్ త్వరలో మూడు చర్మ సౌందర్య సాధనాలను ప్రవేశపెట్టబోతోంది. ఇక అన్‌ఆర్గనైజ్డ్ సెక్టర్‌లో పుంఖానుపుంఖాలుగా సౌందర్యసాధనాలు హెర్బల్ పేరుతో చలామణీ అవుతున్నాయి. హెర్బల్ కాస్మెటిక్స్ ఎగుమతులలో చైనా తర్వాత మనదేశం రెండవ స్థానంలో ఉంది.

పురుషులేం తక్కువా?

సౌందర్య సాధనాలంటే కేవలం స్త్రీలకు సంబంధించినదేనా ? ఏమాత్రం కాదు. తాజాగా పురుషులు కూడా ఈ విషయంలో పోటీ పడుతున్నారు. పురుష పర్సనల్ కేర్ ఉత్పాదనల మార్కెట్ 790 కోట్లు! అందులో అతి ఎక్కువ వాటా కలిగింది. జిల్లెట్. ఆ తరువాతి స్థానాల్లో గోద్రేజ్, హిందుస్తాన్ లీవర్, కావిన్‌కేర్ ఉన్నాయి. మోడీకేర్, ఇటీవలి కాలంలో హెయిర్ కలర్ విభాగంలో విపరీతమైన పెరుగుదల ఉంది. అరడజనుకు పైగా టాప్ బ్రాండులు, అందులోనూ అంతర్జాతీయ బ్రాండులు, దాదాపు 10 రకాల రంగులు, వాటిలో మళ్లీ పర్మనెంట్, టెంపరరీ, గ్లోయింగ్ వగైరాలతో హెయిర్ కలర్ వ్యాపారం విరాజిల్లుతోంది.

ఖరీదైన వ్యాపారం

సౌందర్య సాధనాల మార్కెట్ అనూహ్యంగా పెరుగుతోంది. నెయిల్‌పాలిష్ మార్కెట్ 110 కోట్ల రూపాయలుండగా, లిప్‌స్టిక్ మార్కెట్ 100 కోట్ల పైమాటే. మన దేశంలో లాక్మె బ్రాండ్ 50 శాతం కంటే ఎక్కువ షేర్ కలిగి ఉంది. ఆ తరువాతి స్థాయి రెవ్లాన్‌ది. అసలు మొత్తం కాస్మెటిక్స్ మార్కెట్ మనదేశంలో 3000 కోట్ల పరిధి కలిగి ఉంది. అందులో చర్మ సంబంధిత ఉత్పత్తుల పరిధి 1200 కోట్లు. ఈ 1200 కోట్లలో 60 శాతం ఫెయిర్‌నెస్ క్రీములే! అందులో 53% వాటా ఉన్నది హిందూస్తాన్ లీవర్ (ఫెయిర్ & లవ్లీ), 12% ఉన్నది కావిన్‌కేర్ (ఫెయిరెవర్), 4% వాటాతో గోద్రేజ్ (ఫెయిర్ గ్లో) ఉన్నాయి. మిగతావన్నీ రకరకాల క్రీములు, లోషన్లు, సబ్బులు.

అందానికి మూల్యం

❑ ఎసిటోన్ - నెయిల్ పాలిష్ రిమూవర్ - చర్మం, కళ్లు, శ్వాస, నాడీ వ్యవస్థ ❑ బ్యూటిలేటెడ్ హైడ్రాక్సీ టాలీన్ - లిప్‌స్టిక్, షేవింగ్ క్రీమ్, బేబీ ఆయిల్ - కాన్సర్ కారకం ❑ పార్మాల్డీహైడ్ - షాంపులు, మాస్కరా, యాంటీ -ఏజింగ్ క్రీములు, కొన్ని డియోడరెంట్లు అలర్జీ, ఆస్మా, తలనొప్పి, దద్దుర్లు ❑ మినరల్ ఆయిల్ - వ్యాక్స్, బేబీ ఆయిల్, మాయిస్చరైజర్లు - చర్మ సమస్యలు ❑ మిథైల్/ ప్రొఫైల్ పారాబెన్స్ - చాలా కాస్మెటిక్స్‌లో నిలువ ఉంచే పదార్థం - అలర్జీ ❑ ప్రొపలీన్ గ్లైకాల్ - హెయిర్ ప్రొడక్ట్స్, ఆఫ్టర్‌షేవ్, డియోడరెంట్లు, మౌత్‌వాష్, టూత్‌పేస్ట్ ❑ కళ్లు, గొంతు, చర్మ, సమస్యలు ప్రయోగాల్లో కార్సినోజెనిక్ అని తేలింది. టాల్క్ పౌడర్ లోని ఆస్బెస్టాస్ కూడా కార్సినోజెనిక్

ఒకటి బాగా నల్లని వారికొకటి... ఇలా వ్యాపారస్తులే వర్గీకరణచేసి అందుకు తగ్గ ఉత్పత్తిని తయారుచేసి అమ్మేస్తున్నారు. ఇవన్నీ దాదాపు ఒకే రకంగా పని చేస్తాయన్నది చాలామందికి తెలీని విషయం.

'ఇది ఒక రకంగా ఇమోషనల్ బ్లాక్‌మెయిల్. ఒక బలహీనతను కల్పించి ఆ బలహీనతకు మందు ఇది అని తమ వ్యాపారాన్ని పెంచుకోవడం దారుణం. అయినా ఫిర్యాదు చేసే వాళ్లెవరూ లేరు. ఇదే వాళ్ల వ్యాపారాన్ని మరింత బలపరుస్తుంది' అన్నారు విజయ్.

ఉన్న రూపాన్ని ఉన్నట్టు అంగీకరించడం ఎదుటివాళ్లకు సాధ్యపడకపోవడం అటుంచి, అసలు మన రూపాన్నే (అది నిజంగా బాగానే ఉన్నా) మనం ఆమోదించుకోలేని పరిస్థితిలో ఉన్నాం. ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా బయటకు వెళ్ళాల్సిన అవసరం లేనివారు కూడా చర్మ, కురుల 'సంరక్షణ' కోసం పాట్లు పడుతూంటారు. అసలు కాస్మెటిక్స్ అవసరం లేని చిన్న పిల్లలకు కూడా మస్కారాలు, లిప్‌స్టిక్‌లూ, నెయిల్‌పాలిష్‌లూ తప్పనిసరి అయిపోయాయి. అసలు సరైన ఆహారనియమాలూ, ఎక్కువనీరు, క్రమబద్ధమైన వ్యాయామమూ, మత్తు పానీయాలూ, సిగరెట్లూ వంటి దురలవాట్లూ లేకపోవడమూ వంటి అంశాలను పాటించగలిగితే కాస్మెటిక్స్ అవసరమే రాదంటున్నారు నేచురోపతి వైద్యులు.

'మెహానికి మట్టి పట్టించుకోవడం కూడా కాస్మెటిక్స్ కిందికే వస్తుంది కదా! అది నేచురోపతీ కాదా అనడుగుతోంది రజని.

చర్మపు రంగూ, వెంట్రుకల లక్షణమూ జన్యుపరంగా వచ్చే అంశాలు. అమాంతంగా చర్మపు రంగును మార్చలేం. చర్మంలోనూ, వెంట్రుకలలోనూ రంగునిచ్చే పదార్థం మెలానిన్ మోతాదును బట్టి నలుపుదనం, తెలుపుదనం ఉంటాయి. కొన్ని జాతులు, కొన్ని ప్రదేశాలను బట్టి ఈ మోతాదు ఉంటుంది. ఆఫ్రికా జాతులలో తక్కువ. అమెరికన్లు తమ ఒంటి రంగు నల్లబరచుకోవాలని టానింగ్ క్రీములను వాడితే మనం ఫెయిర్‌నెస్ క్రీములను వాడతాం. తల వెంట్రుకలను నల్లగా ఉంచుకోవాలని కొందరు కోరుకుంటే, రకరకాల రంగుల్లో ఉండాలన్నది కొందరి ఇష్టం. పుట్టుమచ్చలు అడ్డం అనుకునేవాళ్లూ ఉన్నారు. అవే అందమని పెట్టుమచ్చల్ని పచ్చబొట్టుల్లా పెట్టించు కునేవాళ్లూ ఉన్నారు.

కొంతమంది స్వతహాగా జిడ్డోడే చర్మం కలిగి ఉంటారు. ఇంకొంతమందికి పొడి చర్మం ఉంటుంది. ఎండిపోయినట్టుండే జుట్టూ, వాడిపోయినట్టుండే ముఖమూ శరీరంలో సమస్యలకు సంకేతాలు. కంటికింది చారలూ, విరిగిపోయే గోళ్లూ కూడా అంతే. మొటిమలు హార్మోన్ల ప్రభావం. బట్టతల, తెల్లజుట్టు సహజక్రమం. 'అయితే ఇటువంటి వాటన్నింటిని 'ఇక తప్పేదేముంది' అని ఒప్పుకుని ఎలాగోలా జీవించే కన్నా, ఉన్నంతలో 'బాగా' కనిపించాలన్న ప్రయత్నాలలో భాగంగా కాస్మెటిక్స్ వాడితే అది శ్రద్ధనే తెలియజేస్తుంది అంటోంది సుషమ.

'కాస్మెటిక్స్ పైపై పూతలు. అవి పైపై మిథ్యనే చూపిస్తాయి. లోపల్నుండి కాంతివంతమైన చర్మం, మెరిసే వెంట్రుకలూ ఉండాలంటే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత ఉండాలి. అంటే జీవన విధానంలో మార్పు రావాలి. నిద్ర లేమితో బాధపడుతూ కళ్ళ కింద నలుపుకు క్రీములువాడి ఊరుకుంటే ప్రయోజనం లేదు' అన్నారు సరితారావ్.

'కాస్మెటిక్స్ ప్రభావం తాత్కాలికమే అని తెలుసు. కాబట్టే రోజూ వాడుతాం' అంది సుషమ.

ఇప్పుడు కాస్మెటిక్స్ అందరి జీవితాల్లో విడదీయలేని భాగమైపోయాయి. తమకు వాటివల్ల దుష్ప్రభావాలు కలిగేవరకూ వాటిని వాడేవాళ్లు ఉంటారు. ఆ బలహీనతను వ్యాపారం చేసుకునే వాళ్లూ ఉంటారు. కుంకుమ బదులు రంగు కాగితాలొచ్చినా, కాటుక బదులు మైనపు పెన్సిళ్లొచ్చినా, పసుపు బదులు మస్కరాలొచ్చినా అందంగా కనిపించాలన్న తాపత్రయమే. తాతల కాలం నుండి చెవులకు రంధ్రాలు చేయించుకోవడం వున్నదే. 'అభివృద్ధి' జరిగి ఇప్పుడు చెవులేకాక ఎక్కడబడితే అక్కడ రధ్రాలు చేయించుకొని రింగులు వేళాడదీస్తున్నారు. ఉన్న వెంట్రుకలను తీసేసుకోవడం, లేనిచోట వాటిని అతికించుకోవడం, మొటిమల్ని అరగదీయడం, బుగ్గల్లో చొట్టలు కల్పించుకోవడం, ముడతల్ని మాయం చేసే ఇంజక్షన్లూ పళ్లను మెరిపించే సొల్యూషన్లూ... అన్నీ 'అందంగా' కనిపించడం కోసమే.

అసలు అందమంటే మానసికమైనదే కాని దేహానిది కాదు అనేవాళ్ళను అదోరకంగా చూసే రోజుల్లో కాస్మెటిక్స్‌తో కాలం గడపడం సమంజసమే అనిపిస్తుంది. ఎవరికి వారే తాము వాడే కాస్మెటిక్స్‌ను వీలైనంత జాగ్రత్తగా వాడితే ఎక్కువ లాభాలు కలగకపోయినా తక్కువ నష్టంతో తప్పించుకోవచ్చు. ✤



ఆరోగ్యం

యు.సత్యనారాయణ,
పేషెంట్ రిలేషన్ ఆఫీసర్,
ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ. హైదరాబాద్.



డాక్టర్ దగ్గరకి వెళ్తున్నారా?

సాధారణంగా జ్వరం లేదా ఇతర అనారోగ్య సమస్యలొచ్చినప్పుడు సరాసరి డాక్టర్ దగ్గరకు వెళ్లడం మనకు అలవాటు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప, సమాచారం లేకుండా డాక్టర్ దగ్గరికి వెళ్తే ఆయన సర్జరీ చేసేందుకు సమాయత్తం అవుతుండొచ్చు, లేదా ఇతర పనుల్లో బిజీగా ఉండొచ్చు. అలాంటప్పుడు సరిగా పరీక్షించే అవకాశం ఉండదు. దీంతో మన సమయం వృథా అవుతుంది. ఫలితం ఉండదు. అందుకని డాక్టర్ దగ్గరికి వెళ్లేముందు కొన్ని విషయాలు తెలుసుకుని వెళ్తే ఇక ఎలాంటి ఇబ్బందీ ఉండదు. డాక్టర్ దగ్గరికి వెళ్లబోయే ముందు ఏ డాక్టర్ ఎక్కడ ఉంటారు, ఏ సమయంలో చూస్తారు, ఏఏ రిపోర్టులు తీసుకెళ్లాలి, ఎలా వెళ్లాలి మొదలైన అంశాలు తెలుసుకుందామా...

ఫైల్ ఫైల్ : మన ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం అంటే ప్రిస్క్రిప్షన్లు, వాడిన మందుల చీటీలు, ఏవైనా పరీక్షలు చేయించుకుంటే వాటి రిపోర్టులతో ఒక ఫైల్ తయారుచేయాలి. కుటుంబంలో ఎంతమంది ఉంటే అన్ని ఫైల్సు విడిగా చేయడం మంచిది. అలా అన్నీ సిద్ధంగా వుంటే అవసరమైనప్పుడు వెతికే అవసరం ఉండదు. అనారోగ్యానికి గురైన తేదీలను రాసిపెట్టుకోవాలి. దీంతో డాక్టర్ పరిశీలించే సమయం వృథా కాదు.

అపాయింట్‌మెంట్ : ముందుగా ఆసుపత్రికి ఫోన్ చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్‌ను తీసుకోవాలి. మనకు కేటాయించిన సమయానికే వెళ్లాలి. ముందు వెళ్లి మమ్మల్ని చూడాలని ఒత్తిడి చేయకూడదు. ఇంట్లో ఎవరికైనా జబ్బుచేస్తే అందరూ బాధపడడం సహజం. అలాగని జబ్బుపడ్డవారితో కుటుంబసమేతంగా ఆసుపత్రికి వెళ్లడం పద్ధతి కాదు. రోగికి సహాయకులుగా జీవితభాగస్వామి లేదా సన్నిహితులు వెళ్లాలి. మరీ ఎక్కువమంది డాక్టర్ రూమ్‌లోకి వస్తే రూమ్ అంతా కిక్కిరిసి డాక్టర్‌కు చిరాకుగా ఉంటుంది. రోగి సరిగా తన సమస్యను చెప్పలేడు. అంతేకాక డాక్టర్ ఏకాగ్రత దెబ్బతిని విషయాన్ని సరిగా చెప్పలేకపోవచ్చు. పిల్లలకు జబ్బు చేస్తేకానీ ఆసుపత్రికి తీసుకెళ్లకూడదు. ఎందుకంటే పిల్లలకు రోగనిరోధక శక్తి తక్కువ. దీంతో ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఎక్కువ. ఒక రోగికి పరీక్షించడానికి డాక్టర్ 15 నుంచి 20 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఈ సమయాన్ని రోగి సాధ్యమైనంతవరకు ఉపయోగించుకోవాలి.



రోగికే ప్రాధాన్యత : రోగి ద్వారానే సమస్యను వినడానికి డాక్టర్లు కోరుకుంటారు. ఒక్కోసారి రోగి సరిగా చెప్పలేదని సహాయకులకు అనిపించవచ్చు. కానీ వీరికి పరిస్థితిని వివరించాలనే ఉత్సాహం ఉంటుంది. దీన్ని అదుపు చేసుకోవాలి. రోగి చెప్పడం పూర్తయ్యాక ఇంకా ఏవైనా చెప్పని విషయాలుంటేనే చెప్పాలి. అంతేకానీ మళ్లీ మొదటినుంచి ఏకరువు పెడితే డాక్టర్‌కు విసుగొస్తుంది. ఒకవేళ రోగి తాను అన్ని విషయాలూ గుర్తుంచుకుని చెప్పలేనేమోనని అనుకుంటే ఒక కాగితంపై రాసి తీసికెళ్లడం మంచిది.

రిపోర్టులను మరవద్దు : డాక్టర్ దగ్గరికి వెళ్లేముందు గతంలో చేయించుకున్న చికిత్స వివరాలు, పరీక్షల రిపోర్టులను (రక్తపరీక్ష, బిపి, మూత్రపరీక్ష, ఎక్స్–రే) తీసికెళ్లడం మరవద్దు. రిపోర్టులను తేదీలవారిగా వరుసగా పెట్టాలి. తమకు మధుమేహం, రక్తపోటు, ఆస్తమా ఉంటే తప్పకుండా చెప్పాలి. దీంతో చికిత్స సులభమవుతుంది.

డాక్టర్‌ను మాట్లాడనివ్వాలి : రోగి చెప్పింది విని, రిపోర్టులు చూశాక డాక్టర్ తన అభిప్రాయాన్ని, చికిత్స గురించి చెబుతారు. ఇది వినడం చాలా ముఖ్యం. మధ్యలో అడ్డుపడి సమస్యలను ఏకరువుపెట్టడం చేయకూడదు. డాక్టర్ చెప్పింది పూర్తయ్యాక ఇంకా ఏవైనా సందేహాలున్నాయనిపిస్తే అప్పుడు చెప్పాలి. వ్యాధిపై ఇంకా అనుమానాలుంటే మళ్లీ అడిగి నివృత్తి చేసుకోవాలి. డాక్టర్‌ను కలిశాక వెళ్లేముందు కృతజ్ఞతలు చెప్పడం మరవకూడదు.

ఆసుపత్రిలో చేరాక : ఆసుపత్రిలో పన్నెండేళ్ల లోపు పిల్లలను ఇన్‌పేషెంట్ రూమ్‌లోకి అనుమతించరు. ఎందుకంటే ఆసుపత్రిలోని రోగుల ఇన్‌ఫెక్షన్లు పిల్లలకు సోకే అవకాశం ఎక్కువ. రోగి సహాయకుల శ్రేయస్సుకోరే ఈ నిబంధన విధించారు. దీన్ని అర్థం చేసుకుని ఆసుపత్రి వర్గాలకు సహకరించాలి. శస్త్ర చికిత్స అయ్యాక రోగిని రెండు నుంచి మూడు రోజులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి మార్చుతారు. బయటి నుంచి రోగిని చూడటమే మంచిది. కారణం బయటి నుంచి వచ్చిన మనలో ఎన్నో ఇన్‌ఫెక్షన్లు ఉంటాయి. లోపలికి వెళ్తే మన ఇన్‌ఫెక్షన్లు రోగికి సోకి వ్యాధి తీవ్రత పెరగొచ్చు. లేక రోగి ఇన్‌ఫెక్షన్లు మనకూ వ్యాపించవచ్చు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే రెండు నిమిషాల కన్నా ఎక్కువ ఉండకూడదు. రోగితో ఆందోళన కలిగించే విషయాలేవీ (ఇంటి సమస్యలు, ఆసుపత్రి బిల్లులు ఇతరాలు) ప్రస్తావించకూడదు. మన మాటలు అతనికి ఆత్మస్థైర్యం కలిగించేలా ఉండాలి. సంయమనంతో ఆసుపత్రి నిర్వాహకులకు సహకరించాలి.

కొన్ని సందర్భాల్లో అత్యవసర కేసులు వస్తే డాక్టర్ మధ్యలో వెళ్లాల్సి ఉంటుంది. దీన్ని అశ్రద్ధగా భావించకూడదు. మిగతా రోగులు కూడా మనలాంటి వారేనని గమనించాలి. ఓపిక, సహనం ముఖ్యం. గదిలోకి వెళ్లేముందు సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయడం మరవకూడదు. డాక్టర్‌ను కలిసిన తర్వాత ఒకవేళ అత్యవసర పరిస్థితి కలిగితే ఫోన్‌లో అందుబాటులో ఉంటారేమోనని కనుక్కుని ఆ ఫోన్ నంబర్ తీసుకోవాలి.

కథ

రుక్మిణి

ముగ్గిపోయినై



గోపాలు చాలాసేపు దగ్గిండు. కొత్తంగ వినేవాండ్లు గది అలవాటు లేక యమ చిరాకు పడ్తరు. గోపాలుకు మాత్రం ఈ దగ్గుడు బాగా అలవాటైపోయింది. మూడేండ్ల నండి దగ్గుతండు. డాక్టరు చూసి మందులు రాసిండు. గోపాలు మింగలేదు. ఇష్టం లేకగాదు. పైసలు లేక!

గోపాలు పెండ్లాం రోజంత కూల్నాలికి బోతది. గుడిసె పైకప్పు కూలేటట్టుంది. గా రత్తమ్మ దాన్ని బాగు చేయించాలనుకుంది. చేయలేదు. పైసల్లేక. రోజూ గోపాలుకు గుడ్డూ పాలూ పెట్టమని సలహా ఇస్తరు డాక్టర్లు. మాంసం పెట్టమంటరు. కానీ పెట్టనే పెట్టదు.. పైసల్లేక.

కూల్డబ్బులు బియ్యానికీ, చిల్లర సామాన్లకీ సరిపోతయి. కూలికూడా రోజూ దొరకదాయె. వరంగల్‌ల కొడుకున్నడు. బిల్డింగు మేస్త్రీ పన్జేస్తడు. వాడికో పెండ్లాం, చిన్నపిల్ల. గీ మధ్యన జనాలు ఇండ్లుకూడా ఎక్కువ కట్టడంలేదు.. పైసల్లేక!

గోపాలం కాస్త ఇంటర్వల్ ఇచ్చిండు. తర్వాత మళ్లీ దగ్గుకు తగులుకున్నాడు. దగ్గుతూనే "గియాలేందే, పనికిపోలేదు?" అనడిగిండు.

"గివాల వీట్ని అమ్మకోవాలెగద... మరి కొనుక్కునే వాళ్లొస్తే... నేన్లేకపోతే నీకేవెూ 'బేరం' తెల్వదాయె!''

"సర్లే... అసలు కొంటానికెవరొస్తరంటవ్?" అని చాల సార్లు అడిగిండు. అట్లడిగేతలికే చీకటైపోతందాయె... ఎప్పుడూ రాలే!

"నీ తల్లి, గి కాశని కూల్డబ్బులుపాయె..." దగ్గుతనే గోపాలు అరవబట్టిండు.

"సరెగానీ... మనవె పొయ్యి గట్ల తిరిగి అమ్ముకుందం... పా" అని రత్తమ్మ అనంగానే గోపాలు ఓపికతెచ్చుకుని దాని వెంటపడ్డాడు.

"ఇంగో... ఇద్దరుంటరు... ఓటి సర్పంచి. దానికోసం ఇద్దరు పోటి చేస్తంద్రు. మరోటి మన బజారుమెంబరు. దానికిద్దరు వాండ్లదగ్గరికి పోదాం పా"

ఊర్లో దీపాలు నిమ్మలంగ వెలుగుతున్నై... రేపే పంచాయితీ ఎన్నికలు. గోపాలు రత్తమ్మలకు గుర్తింపు కార్డులున్నై! అందరికీ పోటీల ఉన్నవాళ్లు పైసలు... బ్రాండీసీసలు పంచుతంద్రు. ముందుగా సర్పంచి 'కుక్క', గుర్రు అయిలయ్య తాన బోయింద్రు. ఆయన ఇంటి తాన జనం గుంపులు బాగా తాగినట్లున్నరు. జెండాలు, కుక్క గుర్తులు పట్టుకుని ఒకటే 'జేజేలు' కొడుతంద్రు. గందరగోళం. ఫుల్లుగ తాగుతంద్రు గద. ఎవర్నడగాలె? రత్తమ్మ ధయిర్నం చేసి ఒకడ్ని దొరకబుచ్చుకుంది.

వాడు ఎగురుడు ఆపిండు. వాడు పెద్ద పచ్చతలపాగ నోరు కప్పేసిన గుబురు మీసాలు మెడల వెండికంటే... ఎదుర్రొమ్ము మీద మొరుగుతున్న కుక్క గుర్తు.

"ఏంది? ఏంగావాలె? సారాగావాల్నా?" అరిచిండు.

"అదిగాదే... రెండున్నయి... అమ్ముదామనీ" రత్తమ్మ మెల్లగా అన్నది.

"ఓట్లా? గని కొనడం ఎప్పుడో అయిపాయె... గెల్పుడు ఖాయం అయిపాయె! ఇంగ ఇప్పుడు కొనేం జేసుకుంటం! కావాల్నంటే సారాసీసా పడేస్తాం.... పట్కపో!" వాడు మళ్లా ఎగురుడు 'షురూ' చేసిండు.

రత్తమ్మ నిరాశగా వెనక్కి తిరిగింది. గోపాలు ఎడాపెడా ఓ దగ్గుదగ్గి అక్కడే ఓ అరుగు మీద కూకున్నడు. "ఏమైందే? (ఖళ్) ఎంతిస్తమన్నరు?" రత్తమ గోపాలు చేయి పట్టుకుని లేవదీసింది.

"ఈళ్లకు అక్కర్లేదట... సారల మునిగి తేల్తంద్రు..'నక్క' గుర్తు తాన బోదాం పా...!" గట్లని మల్లరోడ్డున పడ్దరు. అంతా గడబిడగా ఉంది. ఎల్లుండే ఓట్లు గద ఊరేగింపులు... ఉపన్యాసాలు బందయినై! అంతా ఇండ్లమీదనె తిరుగుతంద్రు. ఈసారి ఎవడు, ఎవడి తలకాయలు పగలగొట్టలె... అంతాశాంతి. అసలు ఊర్లె వార్డులన్ని డబ్బులు చేతులు మారి... కూడబలుక్కుని ఏకగ్రీవం అయిపాయె! గీ సర్పంచి సీటుతానే బిర్రబిగుసుకుంది. ఎవడు ఎవడికి అమ్ముడుబోకుండ మీసాలు దువ్వి డబ్బులు సరుసుకుంటంద్రు!

'నక్క' గురుతు ఇంటిముందుకాడ జబర్దస్తి గోలైతంది. ఫుల్లుగ తాగినోండ్లు ఎగురుతంద్రు... 'కుక్క' గురుతు వాండ్లను బూతులు తిడతంద్రు ఒకటే లొల్లి సందుజూసుకుని రత్తమ్మ గేటుదాటి కష్టం మీద పెద దర్వాజ వరకైతే పోయింది. లోపల 'నక్క' మారాజు చెంచాగాండ్లతోని ప్లాన్లు జేస్తండు.

"అరె... అరె... ఈడకూడ తయారయినవ్...?" రత్తమ్మ పైకి కిందికి జూసింది. అరె... వాడే! పచ్చతలపాగతాన, తెల్లని జుట్టుకుండు... గనే నోరు కప్పేసిన

మీసాలు, ఎదుర్రొమ్ము మీద నక్క గుర్తు వేలాడుతుంది.

"అరె ముసల్దాన... పో... గాడ కుక్కోళ్లలాన తిరిగి గీడకెందుకచ్చినవ్... పో...పో!" అని బుజం పట్టుకుని బలంగ తోసిండు. రత్తమ్మ ముందు బిక్క చచ్చిపోయింది. ఆ టెంక ఆగబట్టలేక 'థూ' అని ఖాండ్రించి ఉమ్మింది. బిరబిర గేటుదాటి బయటికి వచ్చింది. అలవాటు ప్రకారం గోపాలు గోడవారన కూలబడి ఒకటే దగ్గుతండు.

"ఏమైందే... వీడన్న ఎంతకో ఒకంతటికి (ఖళ్...ఖళ్..) కొంటనన్నడా? దగ్గుకుంటనే గోపాలు అడిగిండు.

"రోత గలీజు ముండా కొడుకులు.. పావయ్యా... పా... మన గుడిసెకు పోదాం... పా" గీపూటకి గింత పచ్చడేసుకుని గింతతిను... డీలా పడిపోతవు"

నెమ్మదిగ నడుసుకుంటూ గుడిసె దగ్గరికి జారుకుంన్రు. లోపల చిన్న బల్బు వెలుగుతుంది. గింత తిన్నంక గోపాలు కుక్కి మంచంల జేరిండు. రత్తమ్మ చాప పరుసుకుని పండుకుంది. బయట చందమామ మసకబారి చూస్తుండు. చింత మీద పిట్టలు దిగులేకుంట నిద్దట్లోకి వెళ్లిపోయినై!

రత్తమ్మకేం అర్థంగావడంలేదు. ఇంతకుముందు జట్ల పండగొస్తే ఎంత సంబరం ఉండేది. వార్డు మెంబర్లు దినాం పొద్దున, సాయంత్రం ఇల్లిల్లు తిరిగి "బాగున్నద అక్కా... ఏందిబావా... ఎటుమావా" అని నోరార పల్కరిచ్చెటోళ్లు ఓట్లు రేపనంగ లిస్టు ప్రకారం చెంబులల్ల సారా యాభయ్యో... వందో మనుసుల్లోటి పంపేటోళ్లు గట్టుండేది!

మరి గిపుడు వాళ్లు వాళ్లు అలాయిబలాయి. ఒకరికొకరికి అమ్ముకుంటన్రు, కొనుక్కుంటన్రు.. మరి జనాలకేం లాభం? ఏకగ్రీవం అయితే వీడు వాడికిచ్చుడో, వాడు వీడికిచ్చుడో ఖతం. అటెంక జనం ఎవుల్ని మందలిచ్చెటట్లులేదు. దొంగలు అస్సలు ఓటుకు 'ఇలువ' లేకుంటపోయింది. మరి గీ ఓటెందుకట! సారా, బ్రాందీ దబ్బులివ్వని ఓటు దండగే గద...థు! బుర్ర వేడెక్కి రత్తమ్మ నిమ్మలంగ నిద్దట్లోకి జారుకుంది.

పొద్దుగాల ఇంకా పూరాగా తెల్లబడలేదు. పిట్టలు మాత్రం లేచి 'కీసుకీసు' మని తిండికోసం వెంపర్లాడుతున్నై! గోపాలు రెండు దగ్గులు దగ్గి, ఓపిక లేక గుడిసె ముందు రాయి మీద పండ్లపుల్లోటి దొరకబుచ్చుకుని నములుతండు. రత్తమ్మ ఉన్న రెండు అంట్లు గోలెం కాడేసి రుద్దడానికి తగులుకుంది.

కుక్కోడో... నక్కోడో ఒకోదానికి వందో రెండొందల్లో ఇస్తే... నాలుగు వందలు పెనిమిటికి మందులకక్కరకు వచ్చేవి. రెండు బ్రాండి సీసాలిస్తే అమ్ముకునేటోల్లం... వందో వందాయాబయ్యో వచ్చెడివి. దొంగ ముండాకొడుకులు. జనాల నెత్తిగొడతన్రు. అసలు గివేం జట్లు? ఇలవ లేకుంటేపాయె! ఇన్నాళ్లయితే ఇల్లిల్లు తిర్గి చేతులు, కాళ్లు పట్టుకుని బతిమిలాడేటోళ్లు... రత్తమ్మ లేచి ఇంట్లె బోల్లు సదురుతంది. గోపాలు ఓ దగ్గుదగ్గి కుక్కి మంచం మీద జేరిపోయిండు.

బయట రాతి కట్టంతాన కారోటి వచ్చి ఆగింది. దాన్లోంచి తెల్లటిపంచెం లాల్చి... (నిగనిగ) కండ్యా ఏసుక్కు ఆసామీ కండ్లద్దాలు పీక్కుంట దిగిండు. ఇంకా అయిదారుగురు కూడా జరుగురుగా దిగిన్రు. గందుల్నుంచి ఒకడు బిరబిర రత్తమ్మ తానకు వచ్చె!

"వార్డు నెంబరు ఆరు. 'మాసిగోపాలు (56) మాసిరత్తమ్మ(50)" అని



బర్రుగ సదివిండు. రత్తమ్మ వాడి మొఖంకేసే చూస్తంది. "మీరేగద" అని వాడు అడిగిండు. రత్తమ్మ కదుపుల మండుతున్నా అవునని తలూపింది.

కారు దిగినోడు 'కుక్క' గుర్తోడు. వాడు అక్కడున్నోళ్లలో 'బాస'లో ఏదో చెప్పిండు. పేర్లు చదివిండు. "ఇగ ఓట్లు ఏయడానికి బయలుదేరున్రి. రిచ్చపంపిస్తం.. ఇస్కూలుకాడ ఎయ్యాలె ఓట్లు" అన్నాడు.

రత్తమ్మ ఏదో అనబోయి తమాయించుకుంది. కుక్కోడు 'బాస'లో మళ్లా ఏదో మొరిగిండు. "ఓ రెండు వందలిస్త... తీస్కోండి!"

వాడు మాటపూర్తి చేయ్యకముందే గటు తాటిచెట్ల వైపునుండి ఇంకో కారొచ్చి ఆగె.. అందులోకెల్లి ఇంకో ప్యాంటు... సొక్కా.. కండ్లద్దాలు.. కోరమీసపోడు దిగిండు. వాడు 'నక్క' గుర్తోడు. వాడి కార్లనుండి మరోడు దిగి కొరకొర జూసుకుంట కాగితాల కమిలకట్టె పట్టుకుని గోపాలు, రత్తమ్మల పేర్లు బిగ్గరగ సదివె.

"ఒరె... మూడొందలు దీస్కుని ఇస్కూలుకాడికి రాన్రి. నక్కకే మీ ఓటెయ్యండి. ఆటో పంపిస్తం!" అని ఒళ్లిరుసుకుంట చెప్పిండు.

కుక్క గుర్తోడు గుర్రుగుర్రు మని సప్పుడు చేసిండు. "ఒరే... నేను అయిదొందలిస్తరా...కుక్కకే ఓటెయ్యన్రి" అన్నాడు.

"యహె... నేను వెయ్యిస్తరా!"

"రెండువేలు"

"మూడువేలు"

"నాలుగు"

"అయిదు"

"...!"

పదివేల దనక పాటసాగిపాయె! రత్తమ్మకు పిచ్చి లేసినట్లయి మొత్తం కూలబడ్డది. గోపాలు దగ్గటం మర్చిపోయి గుడ్లప్పగించి నోరెళ్లబెట్టి చూడసాగె!

పదిహేను వేలదనక అరుసుకున్నంత అక్కడ ఒక్కసారె అన్ని సప్పుళ్లు ఆగిపోయినై! కుక్కా... నక్కా... పిట్టా... పిల్లీ... ఏదీసప్పుడు చేయటం లేదు. గా నిశ్శబ్దం యమా భయంకరంగా ఉంది. రత్తమ్మ గుండెసప్పుడు గోపాలుకు వినపడ్తంది. అప్పుడు ఉండుండి గోపాలు ఒక పెద్ద దగ్గు దగ్గనే దగ్గిండు.

కుక్క తరపు కార్యకర్త, నక్కవైపు ఛోటా నాయకుడు ముచ్చట్లకు కూడా తగులుకున్నారు.

"ఒరె... గీ ఎదవ రెండు ఓట్లకోసరం ఈ ఎదవలకు వేలువేలు దొబ్బపెట్టడం నాన్సెన్స్! తుమ్మితే ఊడిపోయే ముక్కులు. పదిహేను వేలు... వాటితోని ఒక వందోట్లు కొనుక్కోవచ్చు. అనవసరం! అయినా అందరూ ఓట్లేసి చస్తన్రా! వేసిన ఓట్లలో ఎన్ని మురిగిపోవటంలేదు? గీళ్ల ఓట్లు కూడా మురిగిపోయినై! ఒరే మీ తరపున ఒక మనిషిని, మా తరపున ఒక గండా పకీర్‌గాడ్ని గీ ఓట్లంట పోయే టయందాక గీడనే కాపలా పెడదాం. వీళ్లు ఎవల్లకు ఓట్లు వెయ్యద్దు. నీకు పడవ్... మాకు పడవ్... మురిగిపోయేటివాని కింద లెక్క! మాకూ, మీకూ లాభం లేదు.. నష్టం లేదు"

ఇద్దరూ చప్పట్లు చరుసుకున్నరు. కరచాలనం చేసుకున్నరు. ఇద్దరు మనుషులు దుడ్డుకర్రల్తోటి చింతచెట్టు కింద బీడీలు అంటించుకున్నరు. అక్కడోల్లు కోరచూపులు చూస్తన్రు. కార్లు బయ్యిమని వెల్లిపోయినై!

రత్తమ్మ రెండు గుర్తింపుకార్డులను అప్పుడే వెలిగిచ్చిన పొయిల విసిరికొట్టి వికవిక నవ్వింది, హాయిగ నవ్వింది, ఆనందంగా నవ్వింది, పగలబడి నవ్వింది. గా నవ్వుకు చింతచెట్టు మీది పిట్టలు ఒక్కసారి రెక్కలు టపటపలాడిచ్చి మళ్లా గుసగుసలకు తగులుకున్నయి.

గోపాలు గుడిసెలోపల ఒక పెద్ద దగ్గు దగ్గిండు. ♣

అందుకనీ...

పుల్లారావ్ : నిజంగా నీకు సన్మానం చేయలేకపోయినా, అధమపక్షం దండ తెచ్చి వేయాలి. ఇన్నాళ్లుగా ఎందరో నా దగ్గర అప్పు తీసుకున్నారు. ఒక్కరూ చెప్పిన టైమ్‌కి యిచ్చిచచ్చింది లేదు.

అప్పారావ్: నాకు మట్టుకు తీసుకున్న అప్పల్లా తీర్చటం సరదానా, ఏమన్నానా? ఏదో మీరు టక్కున జేబులోంచి తీసిచ్చారని.. మిగతావాళ్ళలా ఆనక చూస్తాననో, బాంకులోంచి తీసివ్వాలనో నానుస్తూ నాలుగుసార్లు తిప్పలేదనీ.. పైగా నేను అందరికంటే మీ దగ్గిరే తక్కువ మొత్తం తీసుకున్నాను గనకనూ!

- శ్రీకృష్ణ వరప్రసాద్

అవీ... ఇవీ

జోక్స్ : శ్రీకృష్ణ వరప్రసాద్



అలాంటివాడు కాదు

ఇద్దరు యువతుల సంభాషణలో వారి ప్రేమికుల టాపిక్ వచ్చినపుడు -

ఒకరు: నా మోహన్ కల్సినపుడల్లా నా అందం గురించి పొగడ్తలే.

మరొకరు: నా రాజేష్ అలాంటోడు కాదు. ఆత్మ సౌందర్యమే ముఖ్యమంటాడు. నా శాలరీ ఎపుడు ఎంత పెరుగుతుందో, నేనెక్కడెక్కడ ఎంత సేవ్ చేసి, ఇన్వెస్ట్ చేస్తున్నానో, ఏయే నగలు కొనుక్కుంటున్నానో వీటి గురించే మాట్లాడతాడు.

అదీ యిష్టమేనా?

"నాకో వంద అప్పు కావాలోయ్" అన్నాడు అప్పారావ్.

అప్పటికే ఎన్నోసార్లు అతనికి అప్పిచ్చి విసిగిపోయిన పాపారావ్, "అప్పుగా కాదు ఊరికే అయితే యిస్తాను నీకిష్టమేనా?" అనడిగాడు.

అప్పారావ్ సంబరాన్ని మొహంలో తెలియనివ్వకుండా, "సరే అలాగే కానీ" అన్నాడు.

పాపారావ్ "ఈ డబ్బుతో నువ్వో బొచ్చె కొనుక్కుని అడుక్కోవటం మొదలెట్టాలి, అదీ యిష్టమేనా?' అన్నాడు తన ఒళ్లు మంటను ప్రదర్శిస్తూ.

అవునా, కాదా?!

"ఎవరినంటే ఏవరూరుకుంటారోయ్, ఈ కాలంలో! నిన్ను అంటే నువ్వూరుకుంటావా?" అప్పారావ్ బజార్లో కన్పించిన జోగినాథం భుజాలు పట్టి వూపేశాడు.

"అసల్సంగతి చెప్పు" ఆసక్తి లేకపోయినా అడక్క తప్పలేదు జోగినాథానికి.

"గుర్నాథం దగ్గరికి అప్పుకోసం వెళ్తే 'క్రితం ఏడాది తీసుకున్నది తీర్చలేదు. ఏ మొహం పెట్టుకొచ్చావ్' అంటూ కూకలేశాడు. అలా మొహాలు మార్చుకుంటూ అప్పుకోసం బైల్దేరే వీలుంటే, తలొక మొహంతో అందరి దగ్గరా అప్పుల్జేసి, ఎగ్గొట్టటానికి ఈ పాటికి మొహం చాటేసే వాణ్ణా, కాదా?" అన్నాడు.

ఇబ్బందే

మోహన్: మీ యావిడ నీ మాట వింటుందా?

కిషోర్: మామూలుగా చెప్పినపుడు బాగానే వింటుంది. నేనేదైనా ఆర్డరేసినపుడే, తను రంకెలేన్నూ, ఎంత కట్నంపోసి నన్ను కొనుక్కుందో చుట్టుపక్కల ఫ్లాట్ల వాళ్లకి వినడేలా గొంతెత్తుతుంది.

మోహన్: అది నీకు ఇబ్బంది కాదూ?!

కిషోర్: ఇబ్బందే మరి. నేను లంచాలే గాక కట్నం కూడా బాగానే మేశానని ఇరుగు పొరుగోళ్ళు ఇప్పుడు తెగ చెప్పుకుంటున్నారు.



ఏంటీ?!

బస్‌లో అవధాని పక్కసీటు ఆసామి మాటలకు ఉపక్రమించాడు, "మీ కెంతమంది పిల్లలూ?" అంటూ.

"పిల్లాడు ఒక్కడే, కాని పెళ్ళాలు ముగ్గురు" చెప్పాడు అవధాని. అతనికి అపరిచితులతో ఉబుసుపోక మాటలు గిట్టవు. ఇలా పెడసరంగా చెబితే ఆసామి నోరు మూస్తాడనుకున్నాడు.

కాని ఆసామి ఆశ్చర్యంతో నోరు తెరచి, "ఏంటీ?! ఒక్కడే పిల్లాడు, ముగ్గురు పెళ్లాలా? ఆ ముగ్గురిలో ఎవరికి పుట్టాడు? ఒకవేళ పిల్లలు పుట్టటం లేదని మూడోసారి పిల్లడి తల్లినే పెళ్లాడారా?" అన్నాడు కుతూహలం పట్టలేక.

కారనుకో...

లోభి: ఈ ఏడాది కారు కొనేస్తాను చూడు.

ఎదుటివాడు: ఇన్నాళ్లూ టూవీలర్ కొండానికే ఎంతో పీ'నాసి'గా ఆలోచించావ్?! పెట్రోల్ ధరలు భగ్గుమంటున్నాయ్ తెల్సా?

లోభి: నేను ఖర్చుకు వెనకాడుతాననుకున్నావా? భలే వాడివోయ్! రెండు చక్రాల వాహనమైతే ఆదమరుపునుంటే అది పడి, మమ్మల్ని పడేస్తుందని భయపడ్డానంతే! కారనుకో, నాలుగు చక్రాలు. నలుగురు పట్టిపడదోయబోయినా ఏటూ ఒరగదు.


నా అంత అందంగా నవ్వగలరా, ఏదీ ట్రైచేయండి!

అంతేగా...

ఓ రాజకీయుడి ప్రేలాపన:

నా కొడుకును ఈ రొచ్చు రాజకీయాల్లోకి చచ్చినా దింపనంటే దింపను.

విన్నవారి మనసులో మాటలు: పెద్ద పంతమే పట్టావ్‌లే! నువ్వు బతికుంటే ఏమోగానీ, ఛస్తే మటుకూ నీ సీటు ఖాయంగా దఖలు పడేది వారసుడైన నీ కొడుక్కే గదా!



కవికలం

ఆవేశాన్ని అణగార్చుకోడానికి
కవులు కలాలు ఝుళిపిస్తూనేవున్నారు
ఆక్రోశాన్ని అక్షరాల్లో పెట్టి
మార్పుకోసం ఉవ్విళ్ళూరుతున్నారు
వాస్తవాలు నగ్నంగా నర్తిస్తుంటే
ఆశలు మరీచికలవుతున్నా
ఎక్కడో గుడ్డిదీపపు ఆశ
కవుల కలాల్లో చమురు నింపుతోంది
కంటిముందు ప్రపంచం ఆవిష్కరింపబడుతున్నా
సంప్రదాయపు చట్రాన్ని ఛేదించి
అభివృద్ధిపథంవైపు అడుగులేస్తున్నా
తారతమ్యాలు.. బేధాలు తలెత్తుతున్నాయి
ఆశకి మనిషి దాసోహమవుతున్నాడు
మానవీయవిలువలు మంటగలుస్తున్నాయి
ఆవేశాన్ని అణగార్చుకోడానికి
కవులు కలాలు ఝుళిపిస్తూనేవున్నారు
దుశ్శాలువలు కప్పుకుంటూనేవున్నారు
చప్పట్లు మార్మోగుతూనేవున్నాయి

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
పర్సనాలిటీ
డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ :
9849130141

హిప్నో కమలాకర్

నా వయసు పదిహేను సంవత్సరాలు. నేను పదో తరగతి చదువుతున్నాను. నేను 8వ తరగతి చదువుతున్నప్పుడు ఒకబ్బాయి నన్ను ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. అయితే అతనిప్పుడు వేరే ఊళ్ళో ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. సెలవులు లేవని ఊరికి రావటం లేదు. ఈలోపు మా అన్నయ్య స్నేహితుడొకరు నన్ను ప్రేమిస్తున్నానని చెప్పాడు. నన్ను ముందు ప్రేమించిన వ్యక్తికోసం ఆగాలా లేక ఇతని ప్రేమను అంగీకరించాలా అనేది తెలియటం లేదు. ఏం చేయాలో కాస్త చెప్పండి.

– రాధిక, గుంటూరు

నువ్వింకా పదో తరగతే చదువుతున్నావు. కానీ ఇద్దరు అబ్బాయిల ప్రేమ విషయంలో ఎవరిని ఎంచుకోవాలో తెలియదంటున్నావు. నీ వయసు పిల్లలు ముందు చదువు గురించి ఆలోచించాలి. ఈ వయసులోనే ప్రేమలు, పెళ్ళిళ్ళ గురించి ఆలోచిస్తే ఎలా? వాటి గురించి ఆలోచించడానికి ఇంకా చాలా సమయం ఉంది. కానీ ఇప్పుడు చదువుకోలేకపోతే ఆ వయసు తిరిగి రాదు. ముందు నువ్వు జాగ్రత్తగా చదివి నీ చదువు పూర్తి చేయి. మంచి మార్కులతో పదో తరగతి పాస్ అయి మంచి కాలేజీలో సీటు సంపాదించటం కోసం ఆలోచించు. ఈలోపు నిన్ను ముందుగా ప్రేమించిన వ్యక్తి విషయం కూడా నీకు తెలుస్తుంది. అతను నిన్ను నిజంగా ప్రేమిస్తున్నట్లైతే, ఇంటర్ పూర్తిచేసి అప్పుడు పెళ్ళి చేసుకో. డిగ్రీ ప్రైవేటుగా చదువుకుంటే నీకు కూడా ఏదో ఒక ఉద్యోగం వస్తుంది. ఇద్దరూ హాయిగా జీవించవచ్చు. అలా కాకపోతే ముందు నీ చదువు పూర్తిచేసి నీ కాళ్ళమీద నీవు నిలబడే ప్రయత్నం చేయి. ఆ తర్వాతే పెళ్ళి గురించి ఆలోచించుదువుగాని. సరేనా?!

మా నాన్నగారు లేరు, చనిపోయారు. మా అమ్మగారు వేరొకరితో సంబంధం పెట్టుకున్నారు. అతనికి నాకు మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతుంటాయ్. నేను ఎవరితోనో తిరుగుతున్నానని అతను మా అమ్మకు చెబుతున్నారు. అతని మాటే వింటారు. నా మాట నమ్మడం లేదు. వాళ్ళలా అన్నందుగ్గానూ ఈ మధ్యనే ఒక అబ్బాయితో స్నేహం మొదలుపెట్టాను. పెళ్ళి చేసుకుంటానని అతనితో చెప్పాను. నేనలా చేస్తే చచ్చిపోతాను లేదా ఉన్న వ్యక్తితో లేచిపోతానంటోంది మా అమ్మ. అతని కుటుంబీకులు మర్యాదస్తులు. వాళ్ళకు మా అమ్మగారి విషయం తెలిస్తే పెళ్ళికి ఒప్పుకోరు. పరిస్థితి ఇలా మారుతుందని అనుకోలేదు. నిజంగానే నేను అతనిని ప్రేమించాను. ఇప్పుడు నేనేం చేస్తే బాగుంటుందో చెప్పండి.

– విద్యారాణి, నల్గొండ.

మీ అమ్మగారి లైంగిక సంబంధం సరైనది కాదు. మీ కన్నా అతని మాట మిన్న అన్నడం బాగాలేదు. ఈ పెళ్ళి వలన ఆవిడకు ఆటంకం వస్తుందనే అనుమానం వుండివుంటుంది. అందుకే చచ్చిపోతాను అంటోంది. పెళ్ళి చేసుకుంటే ఇలాంటివి మానేస్తావా తల్లిగా బిడ్డపట్ల నీ నిర్ణయం ఏమిటో చెప్పమనండి. అతనికి మీ ఇంటి సంగతి అంతా చెప్పండి. మీ మీద ప్రేమ ఉంటే వాళ్ళకు ఏదో విధంగా నచ్చజెప్పి అతను సమర్థించుకుంటాడు. ఒకవేళ అతను కాదన్నా నిరాశ చెందవద్దు. ప్రేమించానన్న వ్యక్తి అభిప్రాయాలు బయటపడ్డాయి. మీ పట్ల మీవాళ్ళ ఆలోచన తెలుస్తుంది. దాన్నిబట్టి ఫ్యూచర్ నిర్ణయం మీ చేతిలో ఉంటుంది.

నా వయసు 20 సంవత్సరాలు. మేం ముస్లిములం. నేను ఒక బ్రాహ్మణ అబ్బాయిని ప్రేమిస్తున్నాను. అతనూ నన్ను ప్రేమిస్తున్నట్లు చెప్పాడు. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. అయితే మా పెద్దవాళ్ళు ఈ పెళ్ళికి ఒప్పుకోరేమోనని భయంగా ఉంది. ఒకవేళ ఒప్పుకోకపోతే మేం పెళ్ళి చేసుకోవటానికి వేరే మార్గాలేమీ లేవా? మేం చనిపోవాలనుకోవటంలేదు. జీవితంపై ఎంతో ఆశతో ఉన్నాం. మేం పెళ్ళిచేసుకుని కలిసి జీవించే మార్గం చెప్పండి ప్లీజ్!

– నఫీరున్నీసా, ఆదిలాబాద్.

సమాజంలో ఇవాళ ఎన్నో కులాంతర, మతాంతర వివాహాలు జరుగుతున్నాయి. వాళ్ళంతా చాలా ఆనందంగా, సుఖంగా జీవిస్తున్నారు కూడా. అయితే ఇంకా కొన్నిచోట్ల మతాంతర వివాహం చేసుకుంటే ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవలసి వస్తూనే ఉంది. అయితే మీరిద్దరూ మేజర్లు అయ్యుండి మీ ప్రేమమీద నమ్మకం ఉంటే, కలిసి జీవించగలమని అనుకుంటే పెద్దల సమక్షంలో పెళ్ళి చేసుకోవటం లేదా, రిజిష్టర్డ్ మేరేజ్ చేసుకోవటం ఈ రెండు అవకాశాలున్నాయి. పెళ్ళి చేసుకోవాలంటే వీటన్నింటికంటే ముందు ఆర్థిక స్థిరత్వం చాలా ముఖ్యం. మీలో ఎవరైనా ఏదో ఒక ఉద్యోగం చేస్తూ ఆర్థిక వెసులుబాటు కలిగి మీ సంసారం హాయిగా సాగుతున్నప్పుడు తిరిగి అందరూ మీ దగ్గరికి వస్తారు. మీ పెళ్ళికి తమ మద్దతు తెలుపుతారు. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్!

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమ్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ శ్రీ హిప్నోకమలాకర్ తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైరాబాద్ - 500 020.

విజ్ఞాన వీచిక

ఆర్. ప్రవీణ్‌కుమార్

ఆదివారం మధ్యాహ్నపు నిద్ర

ఆదివారం మధ్యాహ్నం లంచ్‌చేసిన తర్వాత కునుకుమీదకు మనసు మళ్లటం మనందరికీ అనుభవంలోదే. అలాంటప్పుడు ఏదైనా పనిచేసుకోవాలనుకున్నాగానీ [illegible] భోజనం తర్వాత నిద్ర ఎందుకు [illegible] ఇప్పటివరకూ మనం [illegible] మాంచెస్టర్ శాస్త్రవేత్తలు పెద్ద పరిశోధనే చేశారు. మనల్ని ఎప్పుడూ అప్రమత్తంగా ఉంచే మెదడులోని కణాలు భోజనం తర్వాత విశ్రాంతి తీసుకునేందుకు ప్రయత్నించడం వల్లే [illegible] [illegible] మెదడు [illegible] ఆధారమే మన [illegible] ప్రతీకార చర్యల్ని నెరిపే నాడీవ్యవస్థ పనిచేస్తుంది. ఇది మనల్ని అప్రమత్తంగా ఉంచేందుకు ప్రయత్నిస్తుంది. ఎప్పటికప్పుడు మెదడులోని కణజాలం నాడీవ్యవస్థకు సిగ్నల్స్ పంపుతూ అలర్ట్ చేస్తుంటుంది. అయితే మనం తీసుకునే ఆహారంలోని గ్లూకోజ్ మెదడు కణాలు ఇలా సంకేతాలు పంపకుండా అడ్డుకుంటుంది. ఫలితంగానే నాడీ వ్యవస్థ కూడా విశ్రాంతి స్థితిలోకి వెళ్లిపోతుంది. గ్లూకోజ్ ఎక్కువగా ఉండే పదార్థాలు, ముఖ్యంగా తీపివస్తువులు తిన్నప్పుడు నిద్ర మనల్ని చుట్టుముట్టేసేది ఇందుకే. 'సాధారణంగా మధ్యాహ్నం రెండు నుంచి నాలుగుగంటల మధ్య మన శరీర అప్రమత్తత కొంత తగ్గుతుంది. ఆ సమయంలో మనం భోజనం చేసినా, చేయకపోయినా' అంటున్నారు నిద్రావస్థ నిపుణులు నైల్‌స్టాన్లే. మానవ శరీర నిర్మాణంలో ఓ ప్రత్యేకతుంది. దేహానికి ఇంధనం ఎప్పుడవసరమవుతుందో, అప్పుడే మెదడు రసాయనం అప్రమత్తత దీపాన్ని వెలిగిస్తుంటుంది. కానీ మధ్యలో 'ఆకలి' వచ్చినప్పుడు మాత్రం.. ఈ రసాయనం వేరేదారిలోకి మారిపోతుంది.

న్యూరాన్లకు సంబంధించి మాంచెస్టర్ శాస్త్రవేత్తల బృందం స్థూలకాయం, అస్తవ్యస్థ భోజనపుటలవాట్లు, జాగృతావస్థను అధ్యయనం చేశారు. గ్లూకోజ్ శాతం పెరిగినప్పుడల్లా మనం ఎంతవరకు అలర్ట్‌గా ఉన్నామనే అంశంపైనే వారు ఎక్కువ దృష్టి కేంద్రీకరించారు. 'ఒరెక్సిన్' అనబడే చిన్నచిన్న ప్రొటీన్లను విడుదల చేసే మెదడులోని నాడీకణాలు గ్లూకోజ్ స్థాయిపై ఆధారపడి ఉంటాయి. వాటిలోని హెచ్చుతగ్గుల ఆధారంగా ఈ నాడీకణాలు పనిచేస్తాయి. గ్లూకోజ్ స్థాయి తక్కువగా ఉంటే మనిషిని చేతనావస్థలో ఉంచేవి ఈ కణాలే. ఈ స్థాయి మరింత పడిపోతే పరిస్థితి నిద్రలేమికి, ఎక్కువైతే అతినిద్ర, స్థూలకాయానికి దారితీస్తుంది.

పరిశోధనలో ముందుగా జన్యు ఇంజనీరింగ్‌తో రూపుదిద్దుకున్న ఓ చిట్టెలుకను తీసుకున్నారు. అది ఒరెక్సిన్ న్యూరాన్లలో ఫ్లోరోసెంట్ ప్రొటీన్ విడుదల చేస్తున్నట్లు గమనించారు. రోజువారీ ఆహారంలో గ్లూకోజ్ మోతాదు తగ్గిస్తూ, పెంచుతూ ఫ్లోరోసెంట్ ప్రొటీన్ విడుదలను గమనించారు. గ్లూకోజ్ మోతాదుకు విలోమంగా ఫ్లోరోసెంట్ ప్రొటీన్‌ల విడుదల ఉంది. గ్లూకోజ్ పొటాషియం అయాన్ ఛానల్స్ ద్వారా ఒరెక్సిన్ విడుదలను అడ్డుకుంటోంది. వాస్తవానికి నాడీకణాలకు శక్తినిచ్చేదే పొటాషియం. దాన్ని గ్లూకోజ్ అడ్డుకుంటూ వుండటంతో కణాలు నిస్సత్తువగా మారుతాయి. అలా ఈ తగ్గుదల, పెరుగుదల సందర్భాల్లో ఎలుక ప్రవర్తనను జాగ్రత్తగా పరిశీలించారు. 'ఒరెక్సిన్ విడుదల చేసే కణ ఆవరణ తొందరగా గ్లూకోజ్ ప్రభావానికి లోనవుతున్నట్లు గమనించాం. అంటే భోజనంచేసిన కొన్ని క్షణాల్లోనే గ్లూకోజ్ తన పనిచేయడం ప్రారంభిస్తుందన్నమాట. అందుకే ఆకలితో నిద్రపోవడం కష్టసాధ్యం' అని పరిశోధక బృందానికి నాయకత్వం వహించిన డాక్టర్ డెనిస్ బుర్దకోవ్ చెప్పారు.

'మన ప్రవర్తన, మన అవసరాలు, సమాజ అవసరాలకు తగట్లుగా ఉంటుంది. మనం దైనందిన కార్యక్రమాల్లో ఉన్నప్పుడు కానీ, ఆందోళనతో ఉన్నప్పుడు కానీ నిద్ర సర్వసాధారణంగా రాదు. కానీ ఆదివారంపూట ఆఫీసుండదు కనుక అత్యవసరంగా చేయాల్సిన పనులు వుండవు. దాంతో ఆరోజును విశ్రాంతిదినంగా భావిస్తాం. సహజంగానే మధ్యాహ్న భోజనం తర్వాత నిద్ర దానంతటదే ముంచుకొస్తుంది...' అంటున్నారు సర్రే యూనివర్సిటీ వైద్య పరిశోధక విభాగంలో స్లీప్ రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నీల్ స్టాన్లే. కానీ భోజనం చేసినా, చేయకపోయినా ప్రతిరోజూ మధ్యాహ్నం రెండుగంటల నుంచి నాలుగుగంటల మధ్య మనలోని చురుకుదనం కూడా కాస్త మందగిస్తుందట. అదన్నమాట సంగతి. ♣

అదీ చేయండి

విఘ్నేష్ ఎంత బద్ధకస్తుడో అంత భోజన ప్రియుడు. ఆరోజు కంచం నిండుగా ఆధరువులు లేకపోయేసరికి భార్యను కసిరాడు.

"నీకు బద్ధకం బలిసి పోయిం"దంటూ.

"మీరు ఒళ్లు బద్ధకంతో మానేసిన పనులన్నీ నా నెత్తిన పడటంలే! తింటానికీ బద్ధకించండి. ఇంట్లో కొంత మిగులూ, మీ ఆరోగ్యానికి మరింత మేలునూ!" అంది ఆమె కూడా గయ్యిమంటూ.

\- శ్రీకృష్ణ వరప్రసాద్

కొత్త పుస్తకాలు

శరత్ సాహిత్యం (తొమ్మిదవ సంపుటం)



బెంగాలీబాబు శరత్‌ను ఇవాళ కొత్తగా పరిచయం చేస్తే ఆవకాయ పచ్చడినో, కొబ్బరిబూరెలనో వర్ణించి చెప్పినట్లుంటుంది. ఆయన రచనలు ఆంధ్రులకు చిరపరిచితాలు. దేవదాసు, పెద్దక్కయ్య లాంటి నవలలు సినిమాలుగా కూడా వచ్చి ప్రేక్షకుల మనసులను దోచుకున్నాయి. 'అ.. శరత్ సాహిత్యంలో ఏముంది? పిడికెడు పాదధూళి, కడివెడు కన్నీళ్ళు తప్ప' అని చులకనగా మాట్లాడేవారు కొద్దిమంది వున్నప్పటికీ ఎక్కువమందికి ఆయన రచనలంటే ఎనలేని మక్కువ. 'అబ్బో సెంటిమెంటును పట్టుకోవడంలో ఆయన్ను మించినవారు లేరు, మనసుల్ని పిండి తెగ ఏడ్పించేస్తాడండీ బాబూ' అని మెచ్చుకునేవాళ్ళెందరో. కనుక వాటిగురించి కొత్తగా చెప్పడానికేంలేదు. అయితే ఎప్పుడో చిన్ననాడు కొనుక్కున్న పుస్తకాలు పాతవైపోయి, జీర్ణావస్తకు చేరి లేదా ఎవరో తీసికెళ్ళడంతో మనవద్ద అసలే లేకుండాపోయి వుండొచ్చు. ఆ లోటును తీర్చేందుకు శరత్ రచనలన్నిట్నీ పది సంపుటాలుగా విశాలాంధ్రావారు మరోసారి ప్రచురించారు. అనువాదకుడు బొందలపాటి శివరామకృష్ణ. పుస్తకప్రియులకు ముఖ్యంగా శరత్ అభిమానులకు ఇదో సదవకాశం.

ఈ తొమ్మిదవ సంపుటంలో 'పల్లీసమాజ్', 'విరాజ్‌బహు', 'పరిణీత', 'నవవిధాన్', 'పంతులుగారు' అనే ఐదు నవలలున్నాయి. ఆనాటి దురాచారాలు ఇప్పుడు చాలావరకూ అంతరించాయి. అయినప్పటికీ మనస్థితులు, అలవాట్లు, కట్టుబాట్లు, అనుబంధాలు ఇవన్నీ కాలమాన పరిస్థితులకు అతీతమైనవి గనుక ఆయన రచనలేవీ కూడా పాతబడినట్లుండవు. ఆయా పాత్రలు సజీవంగా కళ్ళుముందు మెదుల్తున్నట్లే వుంటాయి. శరత్ సృష్టించిన స్త్రీ పాత్రలకు ఆత్మసౌందర్యమే కాదు అపురూపమైన వ్యక్తిత్వమూ వుంటుంది. వాటిని ప్రేమించకుండా వుండలేం.

(శరత్ సాహిత్యం, తొమ్మిదవ సంపుటం, శరత్‌చంద్ర చటోపాధ్యాయ, వెల: 140/-, పేజీలు: 386, ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్)

\- రతన్

చదువు పాటలు

ముత్యబోయిన మలయశ్రీ

వెల: 40/-

ప్రతులకు :

ఎమ్. మలయశ్రీ, టీచర్స్ కాలనీ,

గాంధీ ముద్రణాలయం,

ఎమ్ కుమారస్వామి యాదవ్,

దుర్గాకాలనీ, హన్మకొండ.

స్వీకారం

సింగరేణి సంస్కరణలు

ఒక పరిశీలన

పిట్టల రవీందర్

వెల 20/-, పేజీలు: 66

ప్రతులకు :

విజేత పబ్లికేషన్స్,

ఇంటి. నెం. 20-3-108, విద్యానగర్,

గోదావరిఖని, కరీంనగర్ జిల్లా.

అక్షర తపస్సు



ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ మహబూబ్ వలి రైల్వే గేట్‌మన్. ఏడవ తరగతి మాత్రమే చదివిన ఈ 'అక్షర తపస్సు' రచయిత పుస్తకాల అధ్యయనంలో మునిగి చివరికి రచయితగా తేలాడు. అధ్యయనానికి, సామాజిక దృష్టి ఏర్పడడానికి పాఠశాల విద్య ప్రామాణికం కాదనడానికి షేక్ మహబూబ్‌వలీయే నిదర్శనం. ఈ సంపుటిలో మతఛాందసత్వం, ప్రకృతి భీభత్సం, అమెరికా సామ్రాజ్యవాదం, ఆకలి, వృద్ధాప్యం, సైన్స్ అభివృద్ధి, తదితర అంశాలు అతని కవితా వస్తువులయ్యాయి.

సమాజంలో దయనీయ జీవితాలను గడుపుతున్నవారి పట్ల కవి స్పందన కనిపిస్తుంది. డాన్స్‌తారలు అనే కవితలో 'మాకు గుచ్చిన నోట్ల కాగితాలు/ గాలికి రెపరెపలాడుతుంటే మన జాతీయ జండా గుర్తుకొచ్చి/ ఏడ్వలేక నవ్వే డాన్స్ తారలం మేం' అన్నారో కవితలో. అలాగే రాజకీయ నాయకుల మూర్ఖపు అహంకారాన్ని ఎండగడుతూ 'రోటీ, కపడా ఔర్ మకాన్ చాలు/ పార్టీలు, సీట్లు మీరే పంచుకోండి/ కానీ, ఆకలితో చచ్చేవారిని/ తిని అరగక చచ్చారని మాత్రం అనొద్దు' అన్నారు. అమెరికా బూటకపు మాటల బండారాన్ని 'ప్రపంచ దేశాలకే నీతులు చెప్పినోడా/ నీ దేశ ఆయుధాల సంగతేంటి?' అంటూ ప్రశ్నించారు. కవితలన్నిట్లోనూ సామాజిక స్పృహ తొణికిసలాడుతుంది. సామాజిక మార్పుపట్ల కవి ఆకాంక్ష కనిపిస్తుంది.

ఇందులో కవి తన కవితలతోపాటు తాను సేకరించిన సూక్తులను కూడా చేర్చారు. 1447 సూక్తులు ఒకేచోట లభ్యమవడం ప్రయోజనకరమే.

(అక్షర తపస్సు కవితలు, సూక్తుల సంపుటి, షేక్ మహబూబ్‌వలి, పేజీలు: 120, వెల: 30/-, ప్రతులకు: రచయిత, రైల్వే గేట్‌మన్, రైల్వే క్వార్టర్స్, 37/ఎ, నరసరావుపేట-522 601, గుంటూరు జిల్లా)

\- వీరప్రసాద్

రుచి

పెసరట్టు

కావలసిన పదార్థాలు

పెసలు - రెండు కప్పులు
ఉల్లి తరుగు - ఒక కప్పు
పచ్చిమిర్చి తరుగు - పావుకప్పు
బియ్యం - ఒక కప్పు
ఉప్పు - తగినంత
అల్లం తరుగు - రెండు స్పూన్‌లు
కొత్తిమీర తరుగు - పావుకప్పు
నూనె - సరిపడినంత
జీలకర్ర - ఒక స్పూన్

తయారు చేసే పద్ధతి

పెసలను మొదట శుభ్రంగా కడిగి నీటిలో పోసి నానబెట్టాలి. బియ్యం కూడా వేరుగా నీటిలో పోసి నానబెట్టుకోవాలి. ఈ రెండింటినీ నీరుతీసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. రెండు మిశ్రమాలను ఓ గిన్నెలోకి తీసుకొని ఉప్పు, జీలకర్ర వేసి దోశల పిండిలా చేసుకోవాలి. పెనంమీద దోశలా వేసి అల్లం పచ్చిమిర్చి ఉల్లి తరుగులను, కొత్తిమీరను చల్లి ఎర్రగా కాలనిచ్చి తీసేయాలి. దీన్ని ఉప్మాతో తింటే చాలా బావుంటుంది. లేదంటే కొబ్బరి చట్నీతో అయినా తినవచ్చు.

కొబ్బరి పాయసం

కావలసిన పదార్థాలు

బియ్యం - రెండు కప్పులు
పాలు - రెండు కప్పులు
కొబ్బరి చిప్పలు పచ్చివి - రెండు
పంచదార - రెండు కప్పులు
యాలకుల పొడి - అరస్పూన్
జీడిపప్పు - 50 గ్రా॥
కిస్‌మిస్ - 25 గ్రా॥

తయారు చేసే పద్ధతి

బియ్యాన్ని కడిగి పక్కన పెట్టుకుని ఓ గిన్నెలో కప్పు బియ్యాన్ని రెండు కప్పుల నీరు ఎసరుపెట్టి మరుగుతూ ఉండగా బియ్యం వేయాలి. కొంత దగ్గరపడిన తర్వాత పాలు పోసి ఉడికించుకోవాలి. ఇందులో కొబ్బరికోరు వేసి చివర్లో ఏలకుల పొడి, పంచదార వేసి బాగా కలియబెట్టి జీడిపప్పు కిస్‌మిస్ నేతిలో వేయించి కలపాలి.

- జ్యోతి, ఖమ్మం

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ **కలర్‌ఫొటో**ను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్:

కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : శనిగరం నవీన్‌కుమార్
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు: శ్రీ వాణి విద్యాలయం
లక్ష్యం: టీచర్ అవడం
హాబీలు: ప్రజాశక్తి చదవడం
చిరునామా : ఎస్.నవీన్‌కుమార్, సన్నాఫ్ రాములు, నంగునూర్ (పోస్ట్ & మం), మెదక్ జిల్లా. 502 280.

పేరు : పెసల రామస్వాతి
చదువు : 8వ తరగతి
హాబీలు: ఆటలాడుకోవడం, టీవీ చూడడం, చదవడం.
చిరునామా : పి.రామస్వాతి, డాటరాఫ్ సుబ్రమణ్యం, 1/70, దొడ్డా వారి వీధి, మార్కాపురం, ప్రకాశం జిల్లా. 523 316.

పేరు : సొప్పరి రమాదేవి
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు: శ్రీ వాణి విద్యాలయం
లక్ష్యం: టీచర్ అవడం
హాబీలు: ప్రజాశక్తి చదవడం
చిరునామా : ఎస్.రమాదేవి, డాటరాఫ్ నర్సింహులు, నంగునూర్ (పోస్ట్ & మం), మెదక్ జిల్లా. 502 280.

పేరు : నంభూరు భీమేశ్వరరావు
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
స్కూలు: శ్రీ కృష్ణా విద్యాపీఠ్
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: కథలు చదవడం, క్రికెట్ ఆడడం, కవితలు సేకరించడం, మ్యూజిక్ వినడం.
చిరునామా : ఎన్.భీమేశ్వరరావు, సన్నాఫ్ ఎన్.వి.సూర్యారావు, మెంటాడ (పోస్ట్ & మం), విజయనగరం జిల్లా. 535 273.

పేరు : ముండ్రు మనోహర్
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
స్కూలు: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల, తాడికొండ.
లక్ష్యం: కలెక్టర్ అవడం
హాబీలు: పుస్తకాలు, ప్రజాశక్తి చదవడం, క్రికెట్ ఆడడం.
చిరునామా : ఎం.మనోహర్, సన్నాఫ్ వెంకట్రావు, ఎన్.టి.ఆర్ సెంటర్, వేల్పూరు, శావల్యాపురం (మం), గుంటూరు జిల్లా.

పేరు : పావళ్ళ లక్ష్మీ శిరీష
చదువు : 8వ తరగతి
స్కూలు: ఆదిత్య ఉన్నత పాఠశాల
హాబీలు: డాన్స్ చేయడం, పాటలు పాడడం, చదువుకోవడం.
చిరునామా : పి.లక్ష్మీ శిరీష, డాటరాఫ్ రాచయ్య (టీచర్), కందుకూరు రోడ్డు, పామూరు (గ్రా), ప్రకాశం జిల్లా.

పేరు : సుంకరి మౌనిక
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు: శ్రీ వాణి విద్యాలయం
హాబీలు: ప్రజాశక్తి చదవడం
లక్ష్యం: డాక్టర్ అవడం
చిరునామా : ఎస్.మౌనిక, డాటరాఫ్ మహదేవ్, గణపూర్ (గ్రా), నంగునూర్ (పోస్ట్ & మం), మెదక్ జిల్లా. 502 280.

పేరు : చిప్ప చంద్రకాంత్
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
స్కూలు: శ్రీవాణి విద్యాలయం
లక్ష్యం: టీచర్ అవడం
హాబీలు: ప్రజాశక్తి చదవడం
చిరునామా : సిహెచ్.చంద్రకాంత్, సన్నాఫ్ శ్రీధర్, నంగునూర్ (పోస్ట్ & మం), మెదక్ జిల్లా. 502 280.